సెప్టెంబర్ 1974

60

# ప్రభుత్వానికి విరసం చాలెంజ్

— శ్రీశ్రీ

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

# సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

సెప్టెంబర్ 1974

**60**

---

## సృజన

వచ్చే సంచిక ఎక్కువ పేజీలతో

**'అక్టోబర్ విప్లవ ప్రత్యేక సంచిక'గా వెలువడుతుంది**

వెల: రూ. 2-00

ఏజెంట్లు కమీషనుపోను ముందుగా డబ్బు పంపగోరుతాము.

---

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

1 రూపాయి

## ప్రియమైన 'సృజన' పాఠకులకు

ఎనిమిది మాసాల క్రితం మేము 'పబ్లిషర్స్ నోట్' లో పెరుగుతున్న న్యూస్ ప్రింట్ ధరలు పాఠకుల ముందుంచి 'సృజన' ధర పెంచకుండా పేజీలు మాత్రం తగ్గించినాం- కాని యిటీవలి నెలల్లో రోజురోజూ విపరీతంగా పెరిగిపోతున్న కాగితపు ధర, ప్రింటింగ్ చార్జీల కారణంగా పేజీలు మరింత తగ్గించినా ధర పెంచక తప్పడం లేదు. గత సంవత్సర కాలంలో ముఖ్యంగా కాగితం ధర ఎలా పెరిగిందో మళ్ళీ పాఠకుల ముందుంచుతున్నాం.

1973 డిసెంబర్‌లో 60/- రూ. లున్న 1 రీము (డెమ్మీ సైజు) కాగితం '74 జనవరిలో 75/- రూ.లు ఫిబ్రవరిలో 80/- మేలో 85/- ఇప్పుడు సెప్టెంబర్ నుండి 95/- రూ.లకు పెరిగింది- ఇక ప్రింటింగ్ చార్జీలు 1973 డిసెంబర్‌లో పేజీ 1కి రూ. 4-50 లు '74 జనవరిలో రూ. 5-25 లు. సెప్టెంబర్ నుండి ఇక్కడ వరంగల్‌లో ఒకేసారి రూ. 9/- కి అంటే సుమారు రెండింతలు పెరిగిపోయినవి. 1 సంవత్సర కాలంలోనే ధరలు ఎలా పెరిగిపోయినవో చూడండి.

| 1973 సెప్టెంబర్ | | 1974 సెప్టెంబర్ |
|---|---|---|
| రూ 40-00 | — | రూ. 95/- (1 రీ॥ న్యూస్‌ప్రింట్ ధర) |
| రూ. 4-50 | — | రూ. 9/- (1 పేజీ ప్రింటింగ్ ధర) |

'సృజన' 8 సం॥ ల నుండి వరుసగా వస్తున్నా, ఎన్నిమారులు న్యూస్ ప్రింట్ కోటా కోసం దరఖాస్తులు పెట్టుకొన్నా లాభంలేకపోయింది. చిన్న పత్రికలగూర్చి, 'బలహీన వర్గాల' గూర్చి పెద్ద పెద్ద కబుర్లుచెప్పె ఇందిరమ్మ ప్రభుత్వ వర్గ స్వభావం మనకు తెలియందికాదు- అందుకే 'సృజన' కు న్యూస్‌ప్రింట్ కోటా యీనాటివరకూ రాలేదు- ముందు వస్తుందనే నమ్మకమూ లేదు.

బూర్జువా పత్రికలకు యిటు ప్రభుత్వమూ, అటు ప్రైవేటు సంస్థలూ అనేకవిధాల ఆర్థికవనరులు చేకూర్చిపెడతాయి- ఎటొచ్చీ ప్రజలపక్షాన నిలబడ్డ విప్లవ పత్రికలనూ, సాహిత్యాన్నీ, ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నదీ ప్రభుత్వం- యీ వ్యవస్థ.

ఇప్పుడున్న పేపర్, ప్రింటింగ్ ఇతర ఖర్చుల దృష్ట్యా 'సృజన' 1 రూ. వెలతో 48 పేజీలు వేసినా నష్టమే వస్తుంది. పైగా అక్టోబర్ విప్లవ విజయం, మేడే, జన్మదిన సందర్భాల్లో ప్రత్యేక సంచికలు, వీలైనప్పుడల్లా కవర్ చిత్రాలూ వేస్తూనే ఉన్నాం- వీటన్నింటికీ అదనంగా ఖర్చులు తప్పవు- కాబట్టి నవంబర్ '74 సంచికనుండి 'సృజన' రేట్లు యీ దిగువ విధంగా పెంచవలసి వస్తున్నది.

విడిప్రతి వెల రూ. 1-50 పైసలు

సంవత్సర చందా రూ. 15-00

ప్రజల కొనుగోలు శక్తిని తలచుకొంటే యిది బాధాకరమే- అయినా తప్పడం లేదు- పాఠకులు యీ పరిస్థితిని సానుభూతితో అర్థంచేసుకొని మాతో ఎప్పటివలె సహకరిస్తారని ఆశిస్తున్నాం.

— సాహితీ మిత్రులు

# ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు - విప్లవం కుట్రకాదు

"దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి. జాతులు విముక్తిని కోరుతున్నాయి. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు."

ప్రజలు విప్లవాన్ని కోరుతున్నయుగంలో మనమున్నాం. ప్రజలు విప్లవాలకోసం చేసే పోరాటంలో బాసటగా నిలిచినవాడు తన చారిత్రక, నైతిక, సాంస్కృతిక, రాజకీయ బాధ్యతను స్వీకరించినవాడు. ప్రజల విప్లవ చైతన్యాన్ని, ఆకాంక్షను, పోరాటాన్ని 'కుట్ర'గా నాక్రమించేవాడు నిజమైన కుట్రదారుడు. చీకట్లు తొలగకూడదని తల కిందులా తపస్సుచేసే గబ్బిలాయి.

విప్లవ రచయితల సంఘం ప్రజల విప్లవ పోరాటాలలో ప్రభవించిన సాంస్కృతిక రక్తకణిక. ప్రజల విప్లవ ఫలితాలను పంచుతున్న సాహిత్యఝంఝ. ప్రజల విప్లవ చైతన్యాన్ని పెంచుతున్న తూర్పుగాలి. నూతన ప్రజాస్వామ్య స్థాపన కోసం భారత రైతాంగం సాగిస్తున్న దీర్ఘకాలిక సాయుధవర్గ యుద్ధంలో మేం సాంస్కృతిక సైనికులం.

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజలుచేసిన పోరాటాలను, త్యాగాలను తమ వర్గప్రయోజనాలకు వాడుకుంటున్న దోపిడీవర్గం అన్నిరంగాలలో తన కొమ్ముకాసే సిబ్బందిని సృష్టించుకున్నది. ఫ్యూడల్ వ్యవస్థను వేయిపడగల పునాది మీద చతుర్వర్ణాల ధర్మశాలగా నిలుపటానికి ఈ భూస్వామ్యపాలకవర్గాలు ఎంత పకడ్బందీగా కృషిచేస్తున్నాయో, వాళ్ళ వందిమాగధ సాహిత్యంకూడ అంత సజావుగా గానం చేస్తున్నది. ఈనాడు మాటలకు రాజ్యాంగం సెక్యులర్ సామ్యవాదస్థాపన తనధ్యేయంగా చెప్పుకున్నా రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతికరంగాల్లోకూడా ఫ్యూడల్ అధికారం, దోపిడీ, న్యాయం, సంస్కృతుల పంజరంలోనే యీ చిలుక పలుకుతున్నది.

సాహిత్యరంగంలో టాగోర్ మొదలుకొని విశ్వనాథ సత్యనారాయణవరకు యీ ఫ్యూడల్ సంస్కృతిని కాపాడటానికి కలాలుపట్టినవాళ్ళే.

పాశ్చాత్య నాగరికతా ప్రేరణవల్ల, విజ్ఞానశాస్త్రం సాధించిన మహత్తరవిజయాల ప్రభావంవల్ల, పాశ్చాత్యదేశాల్లో పెట్టుబడిదారీ విధానం వున్నతదశకు చేరుకొని సామ్రాజ్యవాదంగా విస్తరించిన ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వలసగా వున్న భారత దేశంలో పెట్టుబడిదారీ సంస్కృతీ అనుకరణలు, బూర్జువా సాహిత్యఛాయలు కనిపించ

వచ్చుగాని ప్రధానంగా యిక్కడ ధోరణిమాత్రం సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఫ్యూడల్ ధోరణియే.

1947 తర్వాత అప్పటిదాకా బ్రిటిష్ వలసగావున్న భారత దేశం క్రమంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి, బ్రిటిష్, జర్మన్, జపాన్ సామ్రాజ్యవాదాలకు, సోవియట్ సోషల్ సామ్రాజ్య వాదానికికూడా అర్ధవలసగా మారింది. 'నవభారత నిర్మాతలు'గా జవహర్లాల్ నెహ్రూ ప్రశంసలందిన టాటా బిర్లాలవంటి గుత్తపెట్టుబడిదారులు యీ దేశ సంపదను విదేశాలకు కొల్లగొట్టిపెట్టే దళారీలుగా రుజువయ్యారు. భూమిలేని కోట్లాది ప్రజానీకానికి, భూస్వామ్యానికి మధ్యన ప్రధాన వైరుధ్యం అపరిష్కృతంగానే వుండిపోయింది.

అయితే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన రోజుల్లోనే సామ్యవాద వ్యవస్థ గురించి ఒక స్పష్టమైన అవగాహనవున్న కార్మికవర్గ రాజకీయాలు భారత రాజకీయరంగంలోకూడా కళ్లు తెరిచాయి. బెంగాల్, కేరళ, తెలంగాణాలలో వాటి ప్రభావం అన్నిరంగాల్లోనూ గాఢంగా కనిపిస్తుంది. ముఖ్యంగా అక్టోబర్ విప్లవం రెండో ప్రపంచయుద్ధంలో సామ్రాజ్యవాదశక్తుల కూటమిపై సామ్యవాద రష్యా విజయం భారత దేశ సాహిత్యరంగంమీద అరుణారుణ ప్రభావం వేసింది.

శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాలు, అభ్యుదయ రచయితల సంఘం స్థాపన తెలుగు దేశంలో ఎర్రజెండాను సాహిత్యం గుండెల్లోకి తెచ్చుకొన్న తెలిరేకలు "మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది— పదండి ముందుకు, పదండి తోసుక, పదండి పోదాం పైపైకి"అని ఎర్రబావుటా నిగనిగలు సాధించడానికి 'గుండె నెత్తురులు తర్పణచేస్తూ', సాగిపోవాల్సిన అవసరాన్ని శ్రీ శ్రీ తన గీతాల్లో చెప్పాడు. "The History of Society hither to had been the history of class struggles'' అని కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టోలో కార్ల్‌మార్క్స్ చెప్పిన వర్గసంఘర్షణల చరిత్రను కవిత్వంలోకి తెచ్చినవాడు శ్రీ శ్రీ ప్రపంచంలో రెండు వర్గాలున్నాయని, పీడిస్తున్నవర్గమూ, పీడనకు గురియవుతున్నవర్గమూ నిరంతరంగా సంఘర్షిస్తున్నాయని బానిసల తిరుగుబాటు మొదలుకొని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న యీ నాటి విప్లవాలవరకు యిదే సత్యం రుజువవుతున్నదని మార్క్సిస్టులు గతితార్కిక చారిత్రక భౌతికవాదం సహాయంతో నిరూపిస్తున్నారు.

మార్క్సిస్టులు అయినవాళ్ళు చెప్తున్నదీ, కానివాళ్ళు చెప్పనిదీకూడా ఒక నగ్న సత్యం యిక్కడ ప్రస్తావించాలి. ఈ సమాజం వర్గ సమాజంగా వున్నంతకాలం, ఆయా వర్గప్రయోజనాలను నెరవేర్చే సాహిత్యం, సంస్కృతి వెలుస్తూనే వుంటాయి.

రాజకీయాలకు అతీతంగా సాహిత్యం, కళలు ఎన్నడూ లేవనడానికి వాల్మీకి మొదలుకొని విశ్వనాధవరకు, నన్నయ మొదలుకొని నారాయణరెడ్డివరకు ఎవరూ అపవాదం కాదు. అయితే పాలకవర్గాల సాహిత్యానికి భిన్నంగా ప్రజాసాహిత్యంకూడా ఒదిగి ఒదిగీ, ఎదిగి ఎదిగీ, ఏరులా, ఝరిలా ప్రవహిస్తూనే వుంటుంది.

నిజాం నిరంకుశ విధానానికి, జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రారంభమైన తెలంగాణా ప్రజల పోరాటం క్రమంగా కమ్యూనిస్ట్‌పార్టీ నాయకత్వంలో భూమికోసం, భుక్తికోసం, విముక్తికోసం, రైతాంగ సాయుధపోరాటంగా మలుపు తీసుకున్నది. దీర్ఘకాలిక జాతీయ విముక్తి పోరాటంగా సాగవలసిన యీ పోరాటాన్ని కొనసాగించడంలో రివిజనిస్టు నాయకత్వం విఫలమయింది. అప్పటికే కమ్యూనిస్టుపార్టీ నేతృత్వంలో ఏర్పడివున్న అభ్యుదయ రచయితల సంఘం, ప్రజా నాట్యమండలి యీ ప్రజా ఉద్యమాన్ని ప్రచారంచేయడంలో గణనీయమైనపాత్ర వహించాయి. గంగినేని, సోమసుందర్ వంటి కవులు ఉదయించి, వజ్రాయుధంవంటి కావ్యాలు వెలయించింది యీరోజుల్లోనే. ఎర్రజండాలువంటి వాస్తవ పోరాటగాధలు, మాభూమి ముందడుగువంటి నాటకాలు, ప్రజల సాహిత్యం, కళలుగా ప్రచారంచెందింది ఈరోజుల్లోనే. ఇటు పొంగుతున్నవున్న తెలంగాణాలో ప్రజాపోరాటాన్ని బలపరచడం మాత్రమే కాక ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి, వలసవిధానానికి వ్యతిరేకంగాసాగిన ఎన్నో ప్రజాపోరాటాలను, జాతీయ విముక్తి పోరాటాలను బలపరుస్తూకూడా తెలుగు కలాలు వైతాళిక గీతాలు వినదించినవి.

రాజకీయ నాయకత్వంతోపాటు అభ్యుదయ రచయితల సంఘంకూడ రాజీ ధోరణులకు, అలసటను సిద్ధాంతంగా మలచిచెప్పే నగిషీపనికి అలవాటుపడ్డ ఫలితంగా తన ప్రజా స్వభావాన్ని పోగొట్టుకున్నది. ప్రణాళికలోనే మార్క్సిజాన్ని నిర్భయంగాజెండాగా స్వీకరించే సాహసంలేకుండాపోయింది. అరసానికి, ఇది తెలిసి జరిగిన అపచారమే. కుందుర్తి ఎంతో సమగ్రంగా ప్రారంభించి మహాభారత యుద్ధంతో పోల్చదల్చుకున్న తెలంగాణా రైతాంగ సూర్యుడు సాగించిన సాయుధపోరాటం, అందుకే యూనియన్ మిల్ట్రీ జోక్యమే విజయంగా గానంచేయడమనే ప్యూడల్ ప్రయోజనాలకే బలిఅయిపోయింది. ఆరుద్ర త్వమేవాఽహమ్ కూడ తెలంగాణా ప్రజల పోరాటరక్తం త్యాగాన్నీ, కసినీగాక రంగును తన క్యాన్వాసుకు వాడుకోవాలని మోజుపడ్డ కళాకారుని నైపుణ్యంగానే మిగిలింది. కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటరీ రాజకీయాలకు, అభ్యుదయ రచయితల సంఘం, ప్రజా నాట్యమండలి వ్యాపారకళకు, కళావ్యాపారానికి పాకిపోయినవి.

ఈలోగా గతచరిత్రను, తిప్పిరాసే "వర్గసామరస్యధోరణి", "శాంతియుతసహజీవనం" సిద్ధాంతాలు కృశ్చేవ్ తలలో కుక్కగొడుగులై మొలిచినవి చుట్టూవున్న సామ్రాజ్యవాదకూటమి కూల్చలేని సామ్యవాదదుర్గాన్ని లోపలపుట్టిన యీ విషపుమొక్క బీటలువార్చింది. సోవియట్ రష్యా రివిజనిస్టురొంపిలోకిదిగింది మాటల్లో సోషలిజం, చేతల్లో సామ్రాజ్యవాదంగావుంటే దాన్ని సోషల్ సామ్రాజ్యవాదం అనాలని లెనినే చెప్పిపోయాడు. అది ఆయన నెత్తురుతో, చెమటతో నాటిన మొక్కకే చీడపురుగై సోకింది.

ఈ సోవియట్ సోషల్ సామ్రాజ్యవాద ప్రభావం 1956 నుంచికూడ భారత రాజకీయరంగంలోనేకాకుండా అన్నిరంగాల్లోకూడా పాలకవర్గాలద్వారా పరివ్యాప్తమౌతున్నది ప్రజా ప్రయోజనాలను నెరవేర్చేవిషయంలో ప్రజాపోరాటాల ప్రచారవేదికగా అరసం కాలంచెల్లిన సంస్థ అయిపోయింది. పైగా జవహర్లాల్ నెహ్రూకూ, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న భూస్వామ్య, పెట్టుబడిదారీ సంస్కృతులకు కొమ్ముగాసే సంస్థగా మారిపోయింది. కనీసం వీరేశలింగం పంతులు ప్రారంభించిన సంఘసంస్కరణోద్యమాన్ని నిర్వహించడంలోగాని, గురజాడ ప్రారంభించిన హేతువాద ధోరణినిగాని, గిడుగు చేపట్టిన వాడుకభాషా ప్రచారాన్నిగాని ఒక ఉద్యమంగా చేపట్టలేని శవసంస్థగా మిగిలిపోయింది. అందుకే రాజకీయరంగంలో భూస్వామ్యానికి పట్టయిన మతము, కులము, మూఢనమ్మకాలు, అధమ శృంగారంవంటి ఫ్యూడల్ భావాలు తెలుగు సాహిత్యంలో విశృంఖల విహారంచేసినవి. మళ్ళీ రామాయణాలు పుట్టినవి వసంతరాయలు ఆధునిక సాహిత్యాన్నికూడ రాజ్యం చేసాడు. ఆధునిక భావచేతనపేరుతో అరవింద ఘోష్టును శవపునరుద్ధానంచేసే ప్రయత్నంచేసిన 'చేతనావర్తం కవులు', అభ్యుదయ శక్తులమీద క్రూరమైన వీరశైవాన్ని ప్రచారంచేసిన మహాసర్గ మతవాదదురహంకార కవులు అభ్యుదయ నిరోధకశక్తులను తిరిగి స్థాపించే కంకణం కట్టుకున్నారు.

దినదినమూ పెరుగుతున్న దోపిడీని గురించి, అసమానతలనుగురించి, అవినీతి, లంచగొండితనం, ఎన్నికలపేరుమీద జరుగుతున్న రక్తపరివాహాలు, మోసాలు— వీటి గురించి పట్టించుకోవడం మేధావి కర్తవ్యమనే విషయంకూడ విస్మృతిలో పడిపోయింది ఈ కుళ్ళి కంపుకొడుతున్న వ్యవస్థమీద తమ క్రుద్ధపాదాలనుమోపి యీ కుష్ఠువ్యవస్థకు షాక్ ట్రీట్‌మెంట్ యివ్వాలని సాహిత్యరంగంలోకి వచ్చిన దిగంబర కవులు సమాజ వికార స్వరూపాన్ని సాహసంగా బట్టబయలుచేశారు. అయినా శాస్త్రీయ విశ్లేషణలోపించిన కారణంగా నిరసనకుమాత్రమే యీ పెటీబూర్జువా ధోరణి దోహదం చేసింది.

ఈ చారిత్రక విభాతసంధ్యల్లోనే 1967లో నక్సల్‌బరీలో జోతేదార్ల భూస్వామ్య దౌష్ట్యాలకు వ్యతిరేకంగా సంతాల్ తెగ తుపాకీని చేపట్టింది. ఇది అప్రయత్నంగావచ్చిన రైతాంగ తిరుగుబాటు మాత్రంకాదు. వర్గచైతన్యంతో ప్రేలిన తుపాకీ.

రాజకీయరంగంలో 1964లో కమ్యూనిస్టుపార్టీలో వచ్చిన చీలిక వర్గపోరాట పర మైందేమీకాదనే బండారం బెంగాల్‌లో మార్క్సిస్టుపార్టీ అధికారంలోకివచ్చి, నక్సల్ బరీ రైతాంగ పోరాటాన్ని అణచడంలో నిస్సిగ్గుగా బయటపెట్టుకుంది. అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నంలో, వర్గపోరాటాల నణచడంలో, ఆచరణలో ఇందిరావిధేయు లయ్యారు. భూమి సమస్యను పరిష్కరించడంలో నాయకత్వ పాత్ర వహించవలసిన చోట విలన్‌పాత్ర వహించింది మార్క్సిస్టుపార్టీ ప్రజలే చరిత్రను, నాయకులను సృష్టించుకుంటారనే మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రం జిల్లాస్థాయి నాయకుడుకూడా కాని నక్సల్‌బరీ నిర్మాత చారుమజుందార్‌ను భారత ప్రజల ప్రియతమ నాయకునిగా తీర్చింది.

నక్సల్‌బరీలో గర్జించిన వసంతమేఘం శ్రీకాకుళంలో వర్ష మేఘమై మెరుపుల కత్తులను దూసింది. పంచాది కృష్ణమూర్తివంటి మేధావులు, సుబ్బారావు పాణిగ్రాహి వంటి రచయితలు యీ నాగేటిచాళ్ళలో తమకళ్ళను, ఊపిర్లను, కలాలను అర్పించు కున్నారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మార్క్సిస్ట్-లెనినిస్ట్ సిద్ధాంత నేతృ త్వంలో ప్రారంభించిన యీ ఉద్యమంలోకి డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్లు, అన్నివృత్తుల్లో వున్న మేధావివర్గం, యువతరం ఆకర్షింపబడ్డాయి. తెలంగాణాలోకూడా ఖమ్మం, వరంగల్‌జిల్లాలలో రైతాంగం తన విప్లవసాంప్రదాయన్ని సాయుధంగా తిరిగిచేపట్టింది. బత్తుల వెంకటేశ్వరరావువంటి యువమేధావులు, కొల్లిపర నరసింహారావువంటి కళా కారులు యీ ప్రాంతాల్లో పోరాట ఎర్రజెండాను ఎగరేశారు. ప్రజలతో, కష్టజీవులతో సమైక్యమై మేధావి వర్గం ప్రజాపోరాటాల్లో పాలుపంచుకొనే మహత్తరదశ ప్రారంభ మయింది.

తెలంగాణా పోరాటకాలంలోకూడా పోరాటమే అపూర్వమైన ప్రజాసాహిత్యాన్ని సృష్టించింది. అలంకారశాస్త్రాల్లో చెప్పబడే కృత్రిమ అర్హతలుకాక వర్గపోరాట చైత న్యమే అర్హతగా ప్రజాకవులు కలాలను క్రొన్నెత్తురుతో పదునుపెట్టుకున్నారు.

వెంపటాపు సత్యం, సుబ్బారావు పాణిగ్రాహి శ్రీకాకుళం గర్భంలో విచ్చుకున్న పోరాట యోధులుమాత్రమేకాదు, కవులు కూడ.

విశాఖపట్నంలో 1970 ఫిబ్రవరిలో శ్రీశ్రీకి షష్టిపూర్తి జరిగిన నాటికి తెలుగు రాజకీయ, సాహిత్యరంగాల స్వరూపమిది. అప్పటికే దిగంబరకవులు మొదటి రెండు సంపుటాల్లోవున్న నెగెటివ్ దృక్పథాన్ని వదులుకుంటూ రానున్న విప్లవానికి "హింస మంత్రసానిత్వం వహిస్తుంద"నే శాస్త్రీయ సత్యాన్ని గుర్తిస్తున్నారు. 'తిరుగబడు కవులు' కొండల్లో కోనల్లో ప్రారంభమైన పోరాటానికి తమ స్నేహ హస్తాలను అందిం

చారు. 'ట్రిగర్ మీద వేళ్ళతో' రమ్మని ఆహ్వానం అందించారు. శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో ఒకచోటచేరిన తెలుగు రచయితలందరినీ, ముఖ్యంగా ఆరసంలో బాధ్యతవహించిన వారిని, యువతరాన్ని "మీరెటువైపు?" అని నిలదీసి విశాఖ విద్యార్థులు ప్రశ్నించారు. మాటలచాటున, ఇమేజరీలచాటున, నీళ్ళనముల్తూ చెప్పడంకాకుండా యీనాడు ప్రారంభమై కొనసాగుతున్న ప్రజాయుద్ధంపట్ల మీవైఖరి ఏమిటి? అని ప్రశ్నించారు.

1970 ఫిబ్రవరి నుంచి అక్టోబర్‌దాకా తెలుగు సాహిత్యం ప్రసవవేదనలను అనుభవించింది. ఈ విప్లవ సాహిత్య శిశోదయాన్ని పసికట్టిన పాలకవర్గాలు జూలైలో 'అభ్యుదయ సాహిత్యవేదిక' పేరుతో ఆరసాన్ని మళ్లీ దిష్టిబొమ్మగా నిలిపే ప్రయత్నం చేశారు. ఇందులో పాలకవర్గాలకు రివిజనిస్టులు నమ్మినబంటులవలె పనిచేసినా, వీళ్ళ ఆశలన్నీ వమ్ముచేస్తూ విరసం ఏర్పడింది.

1970 అక్టోబర్‌లో ఖమ్మం సుబ్బారావు పాణిగ్రాహి నగర్‌లో విరసం ప్రథమ మహాసభలు జరుపుకునే నాటికి రైతాంగ సాయుధ పోరాటజ్వాలలు వరంగల్, ఖమ్మం ఏజెన్సీ ప్రాంతాల్లోకూడా దావానలాలై వ్యాపించినవి. భారత ప్రజల విముక్తికి, నూతన ప్రజాస్వామ్య స్థాపనకు దీర్ఘకాలిక సాయుధపోరాటమే మార్గమనే విషయం ఎజెండా మీదికి వచ్చింది. ప్రధాన పోరాటరూపమైన సాయుధ పోరాటానికి బాసటగా వుండే అన్ని వర్గపోరాటాలను బలపరచాలని కూడా ఖమ్మం సభలోనే విరసం తన ప్రణాళికలోనే చెప్పుకున్నది. అభివృద్ధినిరోధక సంస్కృతితో పోరాటంచేస్తూ, మార్క్సియన్ సోషలిజం ధ్యేయంగా ప్రజాసాహిత్య సృష్టి కర్తవ్యంగా విరసం ఆవిర్భవించింది.

ఆనాటికే పంచాది కృష్ణమూర్తి, నిర్మల, పాణిగ్రాహి, సత్యం, కైలాసంవంటి శ్రీకాకుళ యోధులు, బత్తుల వంటి తెలంగాణా వీరపుత్రులు రైతాంగ పోరాటంలో పోలీసు కిరాతకుల తుపాకీలకు బలియైపోయారు.

"విప్లవమాగదు, సత్యం చావదు(డు)" అనే దృఢదీక్ష పునాదిగా లేచిన విరసం కేవలం అమరవీరుల త్యాగాలను కీర్తించే సంస్థగానే పరిమితమైతే అది విప్లవానికి అపచారమే అవుతుంది. విప్లవం ఆగకుండా మునుముందుకు సాగడానికి ప్రచార రంగాన్ని విస్తృతపరచడానికి విరసం బాధ్యతవహించాల్సివున్నది. ఈ విషయాలనే మేం ఖమ్మం సభలనాటికన్నా కర్నూలు సభల్లో విస్పష్టంగా నిర్వచించాం. భారతరైతాంగ విముక్తి పోరాటంలో మేం సాంస్కృతిక సైన్యంగా పనిచేస్తాం. భారత రైతాంగ విముక్తికి సాయుధ పోరాటమే మార్గం. మార్క్సిజం - లెనినిజం మావో ఆలోచనా విధానం మా విధానం.

ఈ ప్రణాళికను ఆచరణలో పెట్టడానికి ఖమ్మంనుంచి కర్నూలుదాకా, ఆతర్వాత కూడ విరసం సాహిత్య సాధనంద్వారా సాయుధపోరాట ప్రచార సంచారసంస్థగా తెలుగు దేశం మూలమూలలకు వెళ్ళింది. గత దశాబ్దంలో ఊహించటానికి కూడా వీలులేనంత సాహిత్యాన్ని యీ నాలుగేళ్ళలో సృష్టించింది. ముఖ్యమంత్రిగారు ఆక్రోశంపట్టలేక అఘోరించినట్లుగా విద్యాలయాలమీద గాఢమైన ముద్రవేసింది. ముఖ్యంగా మధ్యతర గతిమీద, మేధావులమీద, యువతరం, విద్యార్థులమీద ఏ సాహిత్యసంస్థకేకాదు ఏ రాజ కీయ సంస్థకుకూడా లేని ప్రాబల్యాన్ని విరసం సాధించింది ఇది విరసం క్రెడిట్ మాత్రం కాదు. విరసం ఏ విప్లవ పోరాట సాంస్కృతిక బాధ్యతనైతే నిర్వహిస్తు న్నదో ఆ విప్లవపోరాటాలను నడుపుతున్న విప్లవ కార్మికవర్గనాయకత్వంలోని రైతాం గానిది ఆ క్రెడిట్ ఒక్క మాటలో సాయుధపోరాట ఎర్రజెండా నాయకత్వంలో నడుస్తు న్నది గనుకనే ఆ అ రుణకాంతుల ప్రసారంలో విరసం ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నది.

శ్రీకాకుళాలను, విరసాన్ని మొగ్గలోనే చిదిమేస్తే విప్లవాన్ని శాశ్వతంగా నివా రించగలననే కలలుగంటున్నాడు వెంగళరావు. ఆయన పోలీసుమంత్రిగా వుండగా శ్రీకాకుళాన్ని అణచివేసిన భ్రమాత్మక ఘనతను పొందాడు. ఆయన ముఖ్యమంత్రి అయ్యేనాటికి ఒక్క శ్రీకాకుళం అక్కడితో ఆగకుండా వరంగల్, ఖమ్మం, కరీం నగర్, ఉభయగోదావరులకు విస్తరించింది.

విప్లవకవులను అరెస్ట్‌చేసి, విప్లవ కవితాసంకలనాలను నిషేధించి, దాడులుచేసి విరసంకు ఎరుపు కలిగించగల ననుకున్నాడు ఆనాడు. ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి ఆయన కళ్ళముందరే విరసం మరింత విస్తృతమవడం మాత్రమేకాక తనవంటి మరో రెండు ప్రజాతంత్ర సంస్థల ప్రావిర్భావానికి దోహదం చేసింది. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, భారత-చైనా మిత్రమండలి విరసం అంటునుంచి ననలేసిన నూతన విప్లవమొక్కలు; ప్రజల పోరాటాల విస్తృత అవసరాలకొరకు ప్రజలు తెరు చుకున్న నూతన విప్లవ గవాక్షలు.

ఇవ్వాళ విరసం తెలుగుదేశంలో తన విప్లవ సాహిత్య కర్తవ్యాలను నిర్వహిం చడానికే పరిమితం కాకుండా భారత దేశంలో యిటువంటి సంస్థలు ఏర్పడటానికి ఆదర్శ మవుతున్నది. రైతాంగ సాయుధపోరాటాలు ఉధృతంగాసాగిన బెంగాల్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్‌వంటి ప్రాంతాల్లోకూడా ఎన్నో విప్లవసంస్థలు, పత్రికలు, సాహిత్య సృష్టి జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో జనకళామంచ్, పంజాబ్‌లో క్రాంతికారి లేఖక్ సమ్మేళన్ అలాంటి సంస్థలు. ఇవ్వాళ వీరందరూ దేశవ్యాప్తంగా విరసంవంటి సంస్థ ఆవశ్యకతను గుర్తిస్తున్నారు.

రైతాంగ పోరాటాలు సాయుధ స్థాయికి చేరుకోకపోయినా కార్మికవర్గ చైతన్యం వల్ల, అంబేద్కర్ ఒక మేరకు కలిగించిన చైతన్యంవల్ల మహారాష్ట్రలో 'దళిత్‌పాంథర్ల' ఉద్యమం ఉప్పెనలా పుట్టుకొచ్చింది. దళితపాంథర్లు మేధావులు రచయితలు, యువకులు. నిమ్నజాతులకు, దళితులకు, దోపిడీకి గురవుతున్నవారికి ప్రాతినిధ్యంవహిస్తున్న యీ కవులలో ఒక యువకవి భారత కసాయివర్గాల తుపాకీగుళ్ళకు బలియై తనరక్తంతో దళిత్‌పాంథర్ల ఉద్యమాన్ని ఎరుపెక్కించాడు. 'ఎన్నికలను బహిష్కరించ'మని వాళ్ళు యిచ్చిన పిలుపు ప్రజల్లో ముఖ్యంగా దళితుల్లో వాళ్ళు చేసిన నిర్మాణాత్మకమైన కృషి ఫలితంగా బొంబాయిలోని లక్షలాది హరిజనులు ఎన్నికలను బహిష్కరించారు. భారత పార్లమెంటరీచరిత్రలోనే మొదటిసారిగా వర్గచైతన్యంతో అధికంగా ఎన్నికలను బహిష్కరించిన ఉదంతమిదే! దళిత్‌పాంథర్ల ఉద్యమమూ, ప్రణాళికా యింకా స్పష్టమైన మార్క్సిస్ట్-లెనినిస్ట్ అవగాహనలోకి రావలసివున్నది. ఆచరణలో అదిజరిగితీరుతుంది. ఇటీవల పూనాను సందర్శించిన ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా నల్లజెండాల ఊరేగింపు తీసాడని దళిత్‌పాంథర్ల నాయకుడు, రచయిత, మేధావి నామ్‌దేవ్‌ధసాల్‌ను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్బంధించింది. ఆయన, ఆయనతోపాటువున్న అరవైమంది దగ్గర కత్తులు, గొడ్డళ్ళు వున్నాయని ఆరోపించింది. విప్లవ రచయితలు కుట్రచేస్తున్నారని ఆరోపిస్తున్న ప్రభుత్వం ఊరేగింపుగాసాగిన విద్యార్థుల, రచయితల, యువకులచేతుల్లో ఆయుధాలున్నాయని ఆరోపించడం దాని స్వభావానికి తగినట్లేవున్నది.

గుజరాత్, బీహార్‌లలో విద్యార్థులు, యువకులు అవినీతికి, లంచగొండితనానికి వ్యతిరేకంగా సాగించిన, సాగిస్తున్న ఉద్యమాలూ అన్నిటికీ పతాకగా ఇరవై రోజులపాటు ఇరవైలక్షలమంది రైల్వేకార్మికులుచేసిన సమ్మె భారత దేశంలో గత ఏడు సంవత్సరాల సాయుధపోరాట ప్రభావం సమాజంలోని అన్నిరంగాల్లోకూడా ఎంత పెనవేసుకొనిపోయిందో నిరూపిస్తున్నాయి.

ఈ కడలి తరగలను అరికట్టాలని, అలలను ఉరితీయాలని, ఆలోచనలమీద నిఘావేసింది ప్రభుత్వం.

ఈ నిర్బంధం మా దుందుడుకు విధానంవల్ల వచ్చిందా? మేం విరసాన్ని సాహిత్యసంస్థగాకాక రాజకీయసంస్థగా మార్చినందువల్ల వచ్చిందా?

నిజానికి విరసం రాజకీయ సంస్థగా మారిందా?

రాజకీయాలకు, సాహిత్యానికి వుండవలసిన సంబంధం ఎలాంటిది? అన్నవి యిక్కడ తేల్చుకోవాలి.

విరసం పుట్టడమే నిర్బంధాలలో పుట్టింది. "ప్రజలను సాయుధంచేస్తున్న రెవల్యూషనరీ నేడు కవి"అని స్పష్టంగా విప్లవ కవిపథాన్ని నిర్వచించిన "మార్చ్"కవితా

సంకలనాన్ని నిషేధించి, సంకలనకర్త కిషన్‌రావుపై 'రాజద్రోహ' నేరం మోపి అరెస్ట్ చేసిన లగాయతు డాక్టర్ ఎం. వి. రమణారెడ్డి, జ్వాలాముఖి, నిఖిల్, చెరబండరాజు, ఎం.టి. ఖాన్, వరవరరావుల అరెస్ట్‌దాకా ఎన్నో బాల్యారిష్టాలను విరసం తట్టుకున్నది. విరసం ప్రచురించిన కవితా సంకలనం ఝంఝ, కుటుంబరావుగారు సంపాదకత్వం వహించిన విరసం కథాసంకలనం 'ఇప్పుడువీస్తున్న గాలి' నిషేధమైనవి. విప్లవసాహిత్యనిషేధమనేది యీ నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వానికి ఒక అలవాటుగా మారిపోయింది. కనుక నిర్బంధాలకు ఒకవేళ రాజకీయాలే కారణమనుకుంటే విరసం మొదటి నుంచీ అలాంటి రాజకీయాలకే అంకితమై నిర్బంధాలకు గురియవుతున్నది.

అట్లని అనాడూ, ఈనాడూకూడ విరసం రాజకీయసంస్థ మాత్రంకాదు.

ఐతే విప్లవ రాజకీయాలతో విరసంకువున్న. వుండాల్సిన సంబంధం ఎలాంటిది?

మావో ఆలోచనావిధానాన్ని మా విధానంగా ప్రకటించుకున్నాం గనుక యీ విషయంలో సాహిత్యం, కళలపై మావో యేనాన్ ప్రసంగాన్ని గీటురాయిగా తీసుకోవాలి. మావో యిలా అన్నారు.

"ఈనాటి ప్రపంచంలో సంస్కృతి, సాహిత్యం, కళ అన్నీ నిర్దిష్టమైన వర్గాలకు సంబంధించినవే. నిర్దిష్టమైన రాజకీయ విధానాలను బలపర్చడానికి వినియోగింపబడుతున్నవే. కళ కళకొరకు, వర్గాతీతమైన కళ, రాజకీయాలకు సంబంధంలేని కళ అంటూ వాస్తవానికి లేదు. శ్రామికవర్గ సాహిత్యం, కళ మొత్తం శ్రామికవర్గ ఆశయంలో ఒక భాగంమాత్రమే. లెనిన్ చెప్పినట్లుగా అవి యావత్తు విప్లవ రథచక్రానికి సంబంధించిన వేరువేరు భాగాలు మాత్రమే."

"మన సాహిత్యం, కళ మొత్తం విప్లవయంత్రంలో ఒక సహజమైన భాగంగా తయారుకావాలి. ప్రజలను ఐక్యం చేయడానికి, వారిని చైతన్యవంతులను చేయడానికీ, అవి బలమైన ఆయుధాలుగా ఉపయోగపడాలి. శత్రువుపై దాడిచేయడానికీ, శత్రువును నిర్మూలించడానికీ ఒకే ఆలోచనతో ప్రజలందరూ హృదయపూర్వకంగా శత్రువుతో పోరాడటానికి అవి బలమైన ఆయుధాలుగా ఉపయోగపడాలి. ఇదే మన లక్ష్యమై వుండాలి."

"...ప్రజల విముక్తి కొరకు జరుగుతున్న మన పోరాటంలో అనేక రంగాలున్నాయి. అందులోనే కలంతో పోరాడేరంగం, తుపాకి ఆయుధంగాగల రంగాలున్నాయి. శత్రువును ఓడించడానికి మనం ప్రధానంగా తుపాకులుగల సైన్యంపై ఆధారపడతాం. కాని ఆ సైన్యం ఒక్కటేచాలదు సాంస్కృతికసైన్యంకూడా మనకుకావాలి. శత్రువును ఓడించడానికి మన సాధారణ సైనికుల్ని సమైక్యం చేయడానికి సాంస్కృతిక సైన్యం అవసరం." (మావో-ఏనాన్ ఉపన్యాసం నుంచి)

శ్రామికవర్గ రాజకీయాలకు అధీనమై విప్లవసాహిత్య సంస్థలు పనిచేయాలి అని మాటల్లో ఒప్పుకుంటున్నవాళ్ళు, కార్మికవర్గానికి Vanguard గా వుండాల్సిన కమ్యూనిస్టుపార్టీ ప్రజాసాహిత్యధోరణులను నియంత్రించాలని సైద్ధాంతికంగా అంగీకరిస్తున్న వాళ్లకూడా యీనాడు భారత దేశంలో అలా Vanguard గా పనిచేసే పార్టీ లేదుగనుక విరసం స్వతంత్రంగా లేదా అతీతంగా లేదా అలీనంగా వుండాలని వాదిస్తున్నారు. ఇది శుద్ధ పలాయనవాదం. అనే మార్క్సియన్ ధోరణి.

ఈ ఏడేండ్లకాలంలో విప్లవ రాజకీయాల్లో చాల గ్రూపులు వచ్చాయిగనుక, ఏ గ్రూపు లేదా ఏ ఒకటి రెండు గ్రూపులు సరియైనపంథాకు దగ్గరలో వున్నాయనే సత్యాన్వేషణకు బదులు అన్నిటికీ దూరంకావాలని, అసలు సంస్థనే మూసివేయాలని సరియైన విప్లవపార్టీ పుట్టేదాకా, విప్లవానికీ, విప్లవసాహిత్యానికీ, పత్రికలకూ 'హాలీడే' ప్రకటించాలని స్వీయ మానసిక సిద్ధాంతాలు చేయడం ఎలుకలు చేరాయి గనుక యిల్లు విప్పుకోవాలన్నట్లుగా వుంది.

దేశంలో ప్రజాయుద్ధపంథాను సంఘటితంగా నిర్వహిస్తున్న ఒకే ఒక్క పార్టీ లేకపోవచ్చు. పార్టీలుగా, గ్రూపులుగా వుండవచ్చు. ఆ అన్నీకూడా దేశంలో నూతన ప్రజాస్వామ్య స్థాపనకోసం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను, మావో ఆలోచనా విధానాన్ని దేశకాల పరిస్థితులకు అనుగుణంగా అంగీకరించి సాయుధపోరాటాన్ని నిర్వహిస్తున్నాయి. ఆ మేరకు సాయుధపోరాట రాజకీయాలకు అధీనంకాకుంటే విరసం పుట్టుకకు, ఉనికికి అర్థంలేదు

ప్రభుత్వ నిర్బంధవిధానానికి జడిసి లేదా తగ్గి కొంతకాలం విరసం తగ్గాలనే వాదనకూడా వుంది. రచయితలు రచయితలుగానే వుంటే చేయిచేసుకునేంత ఫాసిస్ట్ స్వభావం ప్రభుత్వాల కుండదనుకునే వాళ్ళుకూడా వున్నారు. వీళ్ళంతా ప్రపంచచరిత్రనే కాకుండా కళ్ళముందర జరుగుతున్న చరిత్రనుకూడ చూడటానికి నిర్లిప్తులవుతున్నారు.

హిట్లర్‌కాలంలోసాగిన నాజీ నిరంకుశవిధానాలు, ట్రూమన్‌కాలంలో మెకార్ధీయిజం పేరుమీద షేక్స్పియర్ రచనలనుకూడా నిషేధించిన భావనియంత్రణ, చైనాలో మేధావులను, రచయితలను వేటాడి చంపిన చాంగ్‌కై షేక్ క్రూరత్వం, జూలియస్ ప్యూజిక్‌వంటి రచయితల 'రక్తాక్షరాలు' చరిత్రపుటలను మేధావుల, రచయితల, పోరాటాల, త్యాగాల పంక్తులతో నింపినవి.

ఈదేశంలో బ్రిటిష్ వలసపాలనరోజుల్లో బూర్జువా స్వాంత్ర్యభావాలను కలిగి వున్నందుకే దేశద్రోహనేరాలకు గురియైన రచయితలు, పత్రికాకారులు ఎందరోవున్నారు.

ఈనాడు దేశంలో స్వతంత్రభావాలుగల, సామ్యవాద స్వప్నాలుగనే రచయిత లందరూ క్షేమంగావుండి విప్లవరచయితలు మాత్రమే నిర్బంధాలకు గురియవుతున్నారా అంటే, చిత్తశుద్ధిగా దోపిడీకి వ్యతిరేకంగా నోరువిప్పి, కలంకదిపిన ప్రతిరచయితకూ నిర్బంధాలే ఎదురవుతున్నాయి.

దళితపాంథర్ కవి ఏమడిగాడని ?

రాజ్యాంగంలో పొందుపరచబడిన హక్కులుకూడా హరిజనులు పొందడంలేదని.

ఆ హక్కులకోసం అతడు తుపాకీ చేతబట్టలేదు, ప్రదర్శనలో పాల్గొన్నాడు. అంతమాత్రానికే దోపిడీవర్గం తుపాకికి బలిఅయ్యాడు.

పంజాబ్, కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్‌లలో ఎంతోమంది రచయితలు చెరసాలలకు గురిఅయ్యారు. కొంతమంది రచయితలు తుపాకీగుండ్లకు ఎర అయ్యారు.

మతవాద దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటం చేసినందుకు పాలక వర్గాల కనుసన్నల్లో యువమేధావి జార్జ్‌రెడ్డి హత్యజరిగింది.

ఒక నీరవ నిశ్శబ్దమైన ఏకాంత రాత్రి సరోజ్‌దత్తా అనే కవిని కలకత్తా నగర వీధుల్లో మఫ్టీపోలీసులు కాల్చేసిన ఉదంతంగాని, రంగమటియా కొండల్లో సుబ్బారావు పాణిగ్రాహి రక్తాన్ని చిందించి, పంచాది కృష్ణమూర్తితోపాటు పద్నాలుగేళ్ళ బాలకళాకారుడు బంగారుబాబు తామాడ చినబాబును బలిగొన్న క్రూర నిదర్శనాలుగాని చెప్పనక్కర్లేదు

ఇవన్నీ రచయితలు, మేధావులు, కళాకారులు ఎదుర్కొన్న దమననీతికిమాత్రమే నిదర్శనాలు. ఇక కంచికచెర్ల కోటేశు మొదలుకొని గుంటూరు కోటేశువరకు పెత్తందార్ల కొరడాదెబ్బలకు ఆహుతయిన దళితులు, నిమ్నజాతులగురించి రాయడానికి కలాలకు గుండెలుకావాలి

పులికి ఆకలయినా కాకపోయినా అమాయకప్రాణాలమీదికి పంజావిసరడం దాని స్వభావం. పులికంట్లోబడ్డందుకు సాధుజంతువుల సాహసాన్ని నిందించే పెద్దమనుషులే పులిస్వభావాన్ని నిర్వచించే రచయితలకు రాజకీయాలు అంటగడుతున్నారు. పులికిభయపడి, పులిని ఎదిరించే ప్రయత్నమలావుంచి, పులిస్వభావాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నాన్నికూడా విరమించమంటున్నారు.

"చీమా ! చీమా ! ఎందుకు కుట్టావూ ?" అంటే "నా పుట్టలో వేలుపెడితేకుట్టనా మరి" అన్నదట. ఇది ఏ రచయితా చెప్పనక్కర్లేని సామాన్యమానవుని ఆత్మరక్షణా

చైతన్యం. అట్లాగే ఎవరితెరువూ పోకుండా, ఎంతో ఓపిగ్గా, క్రమశిక్షణగా చీమలు పెట్టిన పుట్టలను కైవసంచేసుకోవడం పాముల స్వభావం. బలవంతమైన సర్పమైనా చలిచీమలచేతుల్లో చస్తుందని చెప్పడం ఏ మాత్రం చైతన్యంవున్న రచయిత అయినా చెప్పేసత్యం. నిర్బంధాలకు భయపడి సత్యాన్నిదాయటం నిప్పును బూడిదగా చల్లార్చడమే! భయం చావుకన్నా హీనమయింది. పోరాటమే మా వెన్నెముక.

విరసం తన సాహిత్య సాంస్కృతిక కృషిద్వారా ప్రజల్లో విప్లవచైతన్యాన్ని పెంచి ఐక్యం చేయడంలో విఫలమైతే తన బాధ్యతను విస్మరించినట్లుగా భావించవలసిందేగాని, ఫాసిస్టు పాలకవర్గాల నిర్బంధాలను నిజానికి విరసం ప్రోగ్రెస్ రిపోర్ట్‌గా భావించాలి.

విరసం యీ నాలుగు సంవత్సరాల సాహిత్యకృషితో తెలుగు దేశంలో వటవృక్షాలుగావున్న భూస్వామ్య, మార్మికవాద, బూర్జువా కవులందరినీ అకాడమీలోకి తోసివేసింది. ప్రజలకు, యువతరానికి వాళ్ళు ఎంతో దూరం. ఇక రంగంలోవుండి ప్రభుత్వ, పాలకవర్గాల ఒత్తాసుతో అక్కసుగక్కుతున్న అభ్యుదయ రచయితల సంఘాలు, జాతీయ రచయితల సంఘాలూ పాలకవర్గాల కావలికుక్కలుగా పబ్బంగడుపుకుంటున్నాయే తప్ప ప్రజలదారుల్లోకైనా అడుగుపెట్టలేకపోతున్నాయి. రేడియో, పత్రికలు, సినిమాలు, అకాడమీలు అన్నీ కలిసికూడ ప్రజలలో విరసం వీస్తున్న విప్లవ ఝంఝను అరికట్టడంలో ఏమూలకూ రావడంలేదు.

అందుకే రచయితలమీద యీ దాడులు, యీ నిర్బంధాలు, యీ అక్రమ కుట్ర కేసులు.

చివరకు కోర్టులుకూడ యీ దివాళాకోరు ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని రచయితల విషయంలో సమర్థించలేకపోయాయి. భావాలు నియంత్రణాధీనంకావని మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనావిధానాన్ని ఒక తాత్వికధోరణిగా అంగీకరిస్తున్నపుడు, ఆలోచననుగాని, భావవ్యక్తీకరణనుగాని అరికట్టజూడటం చెల్లనేరదని హైకోర్టు తీర్పు యిచ్చింది.

అందుకే యీసారి రచయితలను 'పి.డి', 'మీసా'ల కింద వాళ్ళ రచనలకోసం, ఉపన్యాసాలకోసం అరెస్టుచేసినందువల్ల ప్రయోజనం లేకపోయినందున వీరి ప్రభావం నక్సలైట్ల కార్యకలాపాలపై వెంటనే ఉంటున్నదని ఆరోపించడానికి కుట్ర చేసింది. మీనవోలు మృతవీరుల స్మారకసభకు, వరంగల్ సాహిత్య పాఠశాలకు, నక్సలైట్లు వచ్చినట్లుగా వారితో, యితర కేడర్‌తో విరసం రచయితలు కార్యకర్తల సమావేశాలు

ఏర్పాటుచేసి, పోరాటరంగంలోకి యువకులను, నిరుద్యోగులను రిక్రూట్ కావడానికి ప్రేరేపించినట్లుగా ఆరోపించారు.

విరసం ఒక ప్రజాసంస్థ. విరసం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో దాపరికంగాని, రహస్యంగాని, కుట్రగానిలేదు. మేం బహిరంగంగా, బాహాటంగా, నిర్ద్వంద్వంగా, నిర్దుష్టంగా, విస్పష్టంగా ప్రజాయుద్ధపంథాను, దీర్ఘకాలిక సాయుధ పోరాటాన్ని సాహిత్యం ఆయుధంగా బలపరుస్తున్నాం. ప్రచారం చేస్తున్నాం. ఇది మా సాంస్కృతిక ధర్మం. మా చారిత్రక కర్తవ్యం. మా నైతికబాధ్యత. ప్రజల పోరాట సాంప్రదాయం మహత్తర ఫలితాలను అనుభవించడమేకాదు, వాళ్ళ కన్నీళ్ళలో కృషిలో, త్యాగంలో పాలుపంచుకోవడంకూడా రచయితలుగా మా విధి.

ఈనాడు ప్రభుత్వం తీవ్రతరమైన ఆర్థికసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇటీవల జారీచేసిన కార్మిక వ్యతిరేక స్వభావంగల వేతనస్తంభనవంటి ఆర్డినెన్స్‌లు, పన్నుల జాబితాగావున్న సప్లిమెంటరీ బడ్జెట్ యీ దివాళాకోరు ఆర్థిక విధానానికి ప్రతిబింబం. ఈ సంక్షోభం యీ దేశానికే పరిమితమైందికాదని, ప్రపంచమంతా యీనాడు ఆర్థిక సంక్షోభానికి, నిత్యావసర వస్తువులధరల వైపరీత్యానికి గురవుతున్నదని ఇందిరా గాంధీ చెప్తున్నమాట ఒక వాస్తవాన్ని ఆమెకు తెలియకుండానే బయటపెడుతున్నది. జనచైనావంటి సోషలిస్టుదేశాలుతప్ప యీనాడు సామ్రాజ్యవాద దేశాలు, వాటిమీద ఆధారపడిన మనవంటిదేశాలు తీవ్రమైన ఆర్థికసంక్షోభాన్ని ఎదుర్కొంటున్న మాట నిజమే. రాజకీయంగా వియత్నామ్, కంబోడియా, లావోస్ ప్రజల పోరాటవిజయాలు; ఆసియా ఆఫ్రికా, లాటిన్ అమెరిన్ దేశాల్లో కోకాకోలా, వోద్కా సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా తలఎత్తుతున్న మూడో ప్రపంచం స్వాతంత్ర్య చైతన్యం అన్నిరకాల సామ్రాజ్యవాదాలను చావువైపు నెట్టుతున్నవి. అందుకే యీ యుగాన్ని సామ్రాజ్యవాదం మరణశయ్యపైవున్న యుగంగా, విప్లవాలు విజయవంతమయ్యేయుగంగా నిర్వచిస్తున్నాం. ప్రపంచవ్యాప్తగా రివిజనిజానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న విప్లవంలో అంతర్భాగంగానే భారత విప్లవం కొనసాగుతుంది. అధిక ధరలతో, ఆహారవస్తువుల కొరతతో, అవినీతి, లంచగొండితనం, ఆశ్రితపక్షపాతం, అధికారవర్గాల నిరంకుశవిధానం ప్రతి సమస్యకూ పోలీసు లాఠీల, తూటాల పరిష్కారంవంటి సమస్యలతో విసిగిపోయి దేశమంతటా జనం యెక్కడికక్కడ తోచిన పోరాటరూపాలను చేపడుతున్నారు. పడుపువృత్తి సంఘాలు మొదలుకొని పైలెట్లదాకా, భూమిలేని పేదరైతులు, వ్యవసాయకార్మికులు మొదలుకొని పోలీసులు, సైన్యంలోని కిందివర్గాలదాకా, వివిధ వృత్తుల్లోవున్న జనం యీ ఆర్థికవ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగబడుతున్నారు. ఆందోళనలు, ఉద్యమాలు నిర్మిస్తున్నారు. వర్గచైతన్యంతో యీ ఉద్యమాలు తలయెత్తినచోట్ల అవి పొలిటికల్ రూపాన్ని తీసుకొంటున్నాయి.

యు.పి. పోలీసుల తిరుగుబాటు, వరంగల్, ఖమ్మంజిల్లాల్లో జరిగిన రైతాంగం పోలీసుల దమననీతికి వ్యతిరేకంగా ప్రదర్శిస్తున్న ప్రతిఘటన, నెల్లిమర్ల జూట్ మిల్లులో కార్మికులు చిందించిన రక్తం, నిత్యమూ దేశంలో నలువైపులా సాగుతున్న పోరాటాలకు సూచనలు మాత్రమే.

వీటన్నిటికీ బాధ్యత ఎవరిది?

ఇవి విప్లవకారులు లేదా రచయితలు చేసినకుట్ర ఫలితమా?

దోపిడీవర్గాల కొమ్ముగాస్తున్న ప్రభుత్వ రాజకీయ ఆర్థిక విధానాల ఫలితమా?

పరిష్కారాలను షాసిస్తు దమనకాండలో వెతుక్కొంటున్న ప్రభుత్వంనుంచి దేనికీ చిత్తశుద్ధితోకూడిన జవాబురాదు. దాని స్వభావమది. అందుకే తన మొహం బాగులేక అద్దాన్ని నేలకేసికొట్టినట్లు, ప్రబలుతున్న రైతాంగ పోరాటశక్తిముందు తమ విధానాల ద్వారా నిలువలేకపోతున్న పాలకవర్గాలు అరుణోదయగానం చేస్తున్న రచయితలను, సూర్యోదయాన్నికూడా కుట్రగా ఆరోపిస్తున్నవి.

పార్వతీపురం కుట్రకేసు పేరుతో ఎంతోమంది మార్క్సిస్టు-లెనినిస్టు నాయకులను కార్యకర్తలను నాలుగు సంవత్సరాలుగా జైళ్ళలో నిర్బంధించిన యీ ప్రభుత్వం, హైదరాబాదు కుట్రకేసు పేరుతో రెండు మూడు సంవత్సరాలు కమ్యూనిస్టు విప్లవకారులను, విప్లవ కమ్యూనిస్టుపార్టీ నాయకులను, కార్యకర్తలను జైళ్ళలో నిర్బంధించిన యీ ప్రభుత్వం యీసారి "సికిందరాబాదు కుట్రకేసు" అనే పేరుతో మరికొంతమంది విప్లవ సానుభూతిపరులను ముఖ్యంగా విప్లవ రచయితల సంఘాన్ని అసలు విచారణలేకుండా రోజులతరబడి నిర్బంధాల్లో వుంచాలని కుట్రచేసింది.

విప్లవరచయితల సంఘం ప్రధాన కార్యదర్శి, భారత-చైనా మిత్రమండలి ప్రధాన కార్యదర్శి, సహకార్యదర్శులతోపాటు, రెండు సంఘాల్లోనూ కార్యవర్గ సభ్యులైనవారిని కొందరిని నిర్బంధించింది. విప్లవ రచయితల సభలు ఏర్పాటు చేసినవారిని, విప్లవ పత్రికలు నడిపేవారిని, అమ్మేవారిని, చదివేవారినికూడా యీ కుట్రకేసులో ఇరికించింది. వీళ్ళంతా కలిసి చట్టబద్ధంగా ఏర్పడిన యీ ప్రభుత్వాన్ని సాయుధంగా కూల్చడానికి కుట్ర చేశారన్నది అరోపణ. 1971 నుంచి యీ నాటిదాకా ఎన్నోహత్యలు, దోపిడీలు, దొమ్మీలు చేసినట్లుగా, అయుధాలు సరఫరా చేసినట్లుగా నోటికొచ్చిందే పాపమన్నట్లుగా రకరకాల ఆరోపణలు.

ఈ అబద్ధాలను నిరూపించుకోవడం కోసం మూడు నెలలుగా దొంగ సాక్ష్యాల వేటలో పోలీసులు అలసిపోతున్నారు. పిచ్చిపట్టిన పాలకవర్గాల ప్రయోజనాల కోసం ఆధారంలేని అబద్ధాలవల అల్లడానికి అసలే మోకాటి తెలివితేటల పోలీసులకు ఏం సాధ్యమవుతుంది?

విప్లవ రచయితలు కుట్రచేసినట్లుగా సాక్ష్యమివ్వ వలసిందిగా పోలీసులు విద్యార్థులను, యువకులను నానాహింసలు పెడుతున్నారు. బ్లేడతో చేతులుకోసి, పోలీస్ స్టేషన్లలో రోజులకు రోజులు హింసించి, ఒత్తిడి చేస్తున్నారు. ఉద్యోగాలిస్తామని, డబ్బిస్తామని, భూములిస్తామని, పెళ్ళిళ్ళుచేసి సుఖజీవితంలో స్థిరపరుస్తామని ఆశలు జూపుతున్నారు. ఇన్నితీర్ల హింసలకు ఓర్చుకొని, ప్రలోభాలకు కూడా తట్టుకొని యీ విషయాలన్నీ కోర్టులో చెప్పిన కామ్రేడ్స్ ఒకరిద్దరు యిప్పుడు మాతోపాటు కేసులో వున్నారు. ఏమీ తెలియనివాళ్ళు, అసలు విరసం గురించిగాని, విప్లవం గురించిగాని తెలియనివాళ్ళు, పోలీసులు యిచ్చే డబ్బుకు ఆశపడ్డవాళ్ళు లేదా భయపడ్డవాళ్ళు పోలీసులు చెప్పమన్నమాటలు చెప్పడానిక సిద్ధపడవచ్చు. తమలెక్చరర్ ఎటువెళ్ళాడో చెప్తే ఇంటర్ పరీక్షల్లో తామేస్వయంగా కాపీలు అందిస్తామని ఆశచూపిన పోలీసులు, ఒక లెక్చరర్ తమకేలానోట్స్ రాయించాడని చెప్పమని తామే ఒక తాగుబోతు లెక్చరర్‌తో నోట్సురాయించిన పోలీసు, అన్నికాలేజీలకు, స్కూళ్ళకువెళ్ళి, ఏదో బనాయింపుకేసు కొరకు యీ కేసులోవున్న రచయితల, సానుభూతి పరుల హాజరు, సెలవువివరాలు సేకరిస్తున్నపోలీసు, ఇండ్లమీద దాడులుచేసి పుస్తకాలు, కాగితాలు, ఉత్తరాలు దొంగ తనంచేస్తున్న పోలీసు, నిందితుల బంధువులమీద, స్నేహితులమీద కూడ నిఘావేసి, పౌరజీవితాన్ని ప్రైవేట్ జీవితాన్నికూడ భయంపీడలతో మలిన పరుస్తున్న పోలీసు నిరూపించ దల్చుకున్న దేమిటి?

విప్లవం కుట్రఅని, విప్లవకారులు, రచయితలు కుట్రదారులని.

ఇది విప్లవానికి వ్యతిరేకంగా దోపిడీవర్గాల కుట్ర అని, ప్రజలుగ్రహిస్తున్నారు.

చరిత్రలో ప్రజలకు వ్యతిరేకంగా కుట్ర శతాబ్దాలుగా జరుగుతున్నది. ఈ కుట్రకు వ్యతిరేకంగా పోరాటాలుకూడా విజయవంతంగా, తరతరాలుగా సాగుతూనేవున్నాయి. ఈనాడు యీ కుట్రలను దించి, ప్రజల ప్రజాతంత్రాన్ని నెలకొల్పే ఆయుధం మార్క్సిజం-లెనినిజం మావో ఆలోచనా విధానం. విరసం యీ ఆయుధాన్ని మరింత మెలుకువతో, మరింత ఐక్యతా సాధనంగా, మరింత పోరాట సాధనంగా ఉపయోగించి తన ఉనికిని మాత్రమే కాదు, ఉద్యమాన్నికూడా కాపాడుకోవాల్సి వున్నది విరసం సరియైన పంథాలో నడిచినంతకాలం, ఎన్నికష్టాలకు, నష్టాలకు ఓర్చియైనా సరే, ప్రజలు విప్లవ చైతన్యంతో విరసాన్ని కాపాడుకుంటారు.

విప్లవం కుట్రకాదు! విప్లవం వర్ధిల్లాలి! విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి! భారత రైతాంగ సాయుధపోరాటాలు వర్ధిల్లాలి! మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి! మృత వీరులకు జోహార్లు!

[సికిందరాబాద్ 10వ మెజిస్ట్రేట్ కోర్టులో విప్లవ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ త్రిపురనేని మధుసూదనరావు చదివిన ప్రకటన. 13-8-74]

## మహోదయం

గన్‌మెన్

రేపటి ఉదయానికి
నేటి చీకటి రాత్రి
రక్తాన్ని కార్చుతుంది
ప్రసవ నొప్పుల్లా
విలవిలలాడిపోతుంది
ఒక్కోసారి
స్పృహతప్పిపోతుంది
మళ్ళీ అంతలోనే తేరుకుంటుంది
ఏది ఏమైనా
ఉదయించక తప్పదు
ఉదయంతో
చీకటి పటాపంచలౌతుంది
అదే
మహోదయం
మానవాళికి నివాళి గీతం.

## మార్గదర్శి

బి. సూర్యనారాయణరెడ్డి

ఈ చీకటికావల
ఈ అరణ్యానికి వెలుపల
వెలుగుతున్న జ్యోత్స్న
పిలుస్తున్న స్వర్గం
గుడ్లగూబలు ఘూకరిస్తున్నాయి
భల్లూకాలు రెండుకాళ్ళతో పరిగెడు
తున్నాయి
అయినా భయంలేదు
ఈ వ్యూహాన్ని ఛేధిస్తాను
ఈ మోసాన్ని జయిస్తాను
ఈ దౌర్జన్యాన్ని దహిస్తాను
గమ్యాన్ని కౌగిలించుకుంటాను
దారిలో మరణించినా
మార్గదర్శినౌతాను

## మా గుండే మా జెండా

గిరిజన్

మా గుండే మా జెండా। మా మనసే మా కంద ।।
మార్క్సిజమే మా పథమోయ్। మావో వజ్రాయుధమోయ్।।

హృదయబలంలోపిస్తే ఆయుధబలముంటేనేం?
ఆయుధానిదేమున్నది? చెయ్యిమాత్రమే పెన్నిధి।
చచ్చుమనిషి చేతిలోన హెచ్చుఆయుధాలుంటే
సాహసి చేతికివస్తే సొంతదార్ని వధియిస్తై।

ఆయుధాలు అంగబలం అధికారం ఎన్నున్నా
పంథా సరికానప్పుడు పడక తప్పదెవడైనా।
బక్కఎముకలోనిశక్తి రక్కసినే చంపగలదు
రైతుకూలిలుద్యమించి రాజ్యం రాబట్టగలరు।
మా గుండే మా జెండా। మా మనసే మాకంద ।।
మార్క్సిజమే మా పథమోయ్। మావో వజ్రాయుధమోయ్।।

# వొడ్డెరోల్లమండి మేము....

వి.బి. గద్దర్

వొడ్డెరోల్లమండి మేమూ
ఇన్నాల్లు గుడ్డిగా
బతికినా ఎడ్డోల్లము ॥వొ॥

మా కండజలం చూసితెనే
కొండలు పిండై పోవు ॥కొ॥
బండమీద కూర్చుంటే
ఎండైనా బెదిరిపోవు ॥వొ॥

ఎండలో మా తనువు కాలి
మాగిన కుండైనాది ॥మా॥
అరికాల్లు కాలి కాలి
రాళ్లై పోయినాయి ॥రా॥
చేతులన్ని కాయగాసి
కత్తులయ్యి పోయినాయి ॥వొ॥

పాలిడిసిన పిల్లనుండి
పానమున్న తల్లిదాక ॥పా॥
కూరుకు పొద్దూనుండి
సూరిదు గూకెదాక ॥సూ॥
కొండతోని సాముజేసి
తిండిలేక చస్తాము ॥వొ॥

చేతికందిన కొడుకు
బర్మబెట్టి కాలిపోతే ॥బ॥
కంట్రాక్టరు కాళ్ళమీద
గొళ్ళునబడి ఏడ్సితె ॥గొ॥
చావుకు నూరప్పిచ్చి
సచ్చెదాక తీర్చుమండు ॥వొ॥

కంట్రాక్టరు కెదురుచెప్తె
కండ్లెర్ర చేసుతాడు ॥క॥
పైస పైస లెక్కడుగుతె
పనికిరాకు పొమ్మంటడు ॥ప॥
అమీన్‌సాబుకు చెప్పి
బేడీలు వేయిస్తడు ॥వొ॥

మూదేండ్లకు - ఐదేండ్లకు
ముక్కు మొఖం తెలియనోడు ॥ము॥
దండాలు పెట్టుకుంట
కొండమీది కొస్తాడు ॥కొ॥
అయి బాయి అనుకుంట
అనుకొని కూర్చుంటడు ॥అ॥
కులపెద్ద ఇంటికెళ్ళి
కులాసాని అడుగుతాడు ॥కు॥
కల్లుకు ఒకనోటిచ్చి
ఓటు దెంగి పోతాడు ॥వొ॥

కాల్లిరిగి - చేతులిరిగి
సచ్చినోల్ల లెక్కలేదు ॥స॥
కాల్లు తెగి, కండ్లు చితికి
రక్తం చిందనిరోజు
రాతలోనె రాసిలేదు ॥వొ॥

గుత్తబట్టిన దొరోడు
కొత్త మేడ లెన్నొగట్టె ॥కొ॥
కాలినడక వచ్చెటోడు
కార్లమీద రాబట్టె ॥కా॥
మా బతుకులు ఏందొగాని
మాకే అర్థంగాదు ॥మా॥
గడియ పురసతులేదు
గవ్వ ఆందానిలేదు ॥వొ॥

నేటినుండి మా బర్మలు
కొండల్లో బెట్టబోము ॥కొ॥

మా గన్నులు, మా సుత్తెలు
బండమీన ఆడబోవు ॥బ॥
ఇందాక మముదోచిన
మాయమ్మ

ఓ యమ్మ
ఇందిరమ్మ ॥ఇం॥
నీ బలగం గుండెల్లో
బర్మాలై పేలుతాం ॥వొ॥

## 'సబ్ ఠీక్ హై'

రాహీ

ఇక్కడ కష్టంగావుందా అని నువ్వడిగినావు
అవును, ప్రజల కష్టాలు తుడిచెయ్యడానికి
అజ్ఞాతంలో కష్టాలు అనుభవిస్తున్న
కామ్రేడ్స్‌ను తలచుకుంటే
యీ నిర్వ్యాపకత్వం కష్టంగా వున్నది.

నాకిక్కడ సుఖంగావున్నదా అని నువ్వడిగినావు
ఈ విశాలదేశం కోట్లాది జనం గుండెల్లో
మబ్బులాదాగిన మెరుపులా వెలుగుతున్న
భవిష్యత్తుమీద ఆశ యీ సంకెళ్ళలో ధ్వనిస్తున్నది

విప్లవాన్ని కబళించాలని నోళ్ళు తెరచుకున్న
జైళ్ళ గర్భంలోకూడ కలకలం
పహరాకాస్తున్న దోపిడీజెండాను తప్పించుకొని
యిక్కడికి ఉదయమూ. జనహృదయమూ వచ్చి
పలకరిస్తూనే వుంటాయి

జైలుగోడ ముళ్ళతీగెమీద కూర్చొని పక్షులు
ఖైదీల చెమటలో చిగురించిన మల్లెలు
మౌనసందేశం వినిపిస్తూనే వుంటాయి

రాత్రి గాలి వీస్తూవుంటుంది
నా కవిమిత్రుడు చెప్పినట్లు
జైలుగోడ ముళ్ళతీగెల్లో చంద్రుడు బందీ అవుతాడు
మేం పాడి, మాట్లాడి, విప్లవ స్వప్నాల్లో మునిగిపోతాం

పాపం, ఒంటరిగాళ్ళు
నిద్రకూ ఆశ్రయానికీ వెలియైన పేదపోలీసులు మాత్రం
'సబ్ ఠీక్ హై' అని
గంట గంటకూ ఆవలిస్తూ వుంటారు.

కథ :

# పొలిటికల్ కమిస్సార్

చైనా మూలం : లియూ పాయ్-యు

అనువాదం : అరుణ

మా రెజిమెంట్ రాజకీయ కమిస్సార్ వూ అంత బలిష్టుడేం కాదు. కొంచెం పాలిపోయినట్టుంటాడు. పనివిషయంలో ఎంత ఖచ్చితమైనవాడైనా, అతని స్నేహ స్వభావం మాత్రం అందరికీ నచ్చింది.

అతనికి కుడిచెయ్యి మాత్రమే ఉంది. 1936 లో ఒక వర్గశత్రువు జరిపిన కాల్పుల్లో అతని ఎడమచెయ్యి పోయింది. ఆ రోజుల్లో ఎర్రసైన్యంలో అతడు ఒక దళనాయకుడు మాత్రమే. చేతిలో హాన్ యాంగ్ రైఫిలూ, జేబులో ఏడు బుల్లెట్లూ, భుజాన ఒక పాత గొడ్డుతోలు- వీటితో భయంకరమైన పచ్చనదిని దాటాడు. ఒకసారి పోరాటం అతి తీవ్రంగా ఉంది. అటువంటి గడ్డుసమయంలో శత్రువుపై అతడు జరిపిన అతి సాహసవంతమైన దాడే మొత్తం సైన్యానికి విజయాన్ని చేకూర్చిపెట్టింది. యుద్ధ రంగంలో అతడు మాత్రం మూర్ఛపోయాడు. హాస్పిటల్ బెడ్‌మీద పడుకుని డాక్టర్ ద్వారా అంతా తెలుసుకున్నాడు. అప్పుడు డాక్టర్ని ఒక్కటేకోరాడు: "నన్ను వెంటనే యుద్ధరంగానికి పంపటానికి మీరు చేయగలిగినదంతా చేయండి." ఆబాధను అలాగే భరించాడు. అతని చేతిని తీసివేశారు. అప్పటినుండి ఒక్కచేతితోనే పోరాడుతున్నాడు.

1945 ఆగస్టు తర్వాత సైన్యం మంచూరియాకు తరలివెళ్ళింది. కాని వూ ఇంకొక గాయంనుండి కోలుకొనకపోవడం వలన గ్రేట్‌వాల్‌కు దక్షిణాన్నే ఉండిపోవలసి వచ్చింది. కొంచెం కోలుకున్న తర్వాత చాలదూరం ప్రయాణంచేసి ఇక్కడికి చేరుకున్నాడు. ఎప్పుడు యుద్ధరంగానికి పోతానాఅని ఆతురతగా వుంది అతనికి. దారి పొడుగునా ఎర్రసైన్యం మంచూరియాలో సాధిస్తున్న విజయపరంపరలను గురించివిని అతడు ఉప్పొంగి పోయాడు.

అతడు హార్బిన్ చేరుకున్నప్పుడు స్థానిక పార్టీశాఖ ప్రతినిధులు అతనితో చర్చించి అనారోగ్యకారణంగా అతనిని యుద్ధరంగపు వెనుకతట్టు ప్రాంతంలోనే ఉంచాలనుకుంటున్నామని సూచనప్రాయంగా అన్నారు.

అదివిని వూ నిరాశతో కుంగిపోయాడు. ఎందుకంటే యుద్ధరంగంలోమాత్రమే తాను ఏ కొంచెమైనా ఉపయోగపడగలనని అతడు భావించాడు. అంతేగాక అతడు పనిచేస్తున్న సైన్యపుశాఖ ఇంకా యుద్ధరంగంలో పోరాడుతూనే ఉంది.

అనుక్షణం యుద్ధరంగంనుండి పిలుపు కోసం ఎదురుచూస్తూ అశాంతితో, చికాకుతో కొన్ని రోజులు ఆ తెల్లభవనంలోనే గడిపాడు. పత్రిక తీయగానే యుద్ధరంగపు వార్తలే అతనికి ముందు కనిపించేవి. దానితో అసహనంగా అతడు గదంతా పచార్లు చేస్తుండేవాడు.

ఒకసారి చెట్టుకిందకూర్చొని తననిగురించి తాను జాగ్రత్తగాను, సుదీర్ఘంగాను ఆలోచించుకున్నాడు. పద్నాలుగు సంవత్సరాల వయస్సులో విప్లవంలో చేరడానికి పశువులకాపరి పనిని వదిలిపెట్టాడు. అప్పటినుండి నిర్విరామంగా పోరాడుతూనే వున్నాడు. 1937లో సాన్ యువాన్ దగ్గర చియావ్ టాన్-చెన్‌లో ఐదు నక్షత్రాలటోపీ[1] తీసివేసినప్పుడు తన సర్వస్వం పోగొట్టుకున్నట్టు దుఃఖించాడు. ఆ చాంగ్ కై-షేక్ విముక్తి యుద్ధంలో ఇప్పుడు మట్టికరుస్తున్నాడు. నేను గోళ్లు గిల్లుకుంటూ వెనుకతట్టుప్రాంతంలోనే ఉంటే మావాళ్లు అక్కడ యుద్ధరంగంలో నేలకొరుగుతూంటారు. చేతకానివాడిలాగ నేను ఆ వార్తలువింటూ కూర్చోవాలా ?... అది తాను భరించలేడు. ఆసాయంకాలం పార్టీశాఖతో చర్చించడానికి మళ్ళీవెళ్లాడు. చూడటానికి మాత్రం అతడు ప్రశాంతంగా ఉన్నట్టే కనిపించాడు. కొంతసేపు నిశ్శబ్దంగా ఉన్నతర్వాత చివరికి దెబ్బ తిన్నట్టు ఇలా అన్నాడు:

"నేను వెనకబడిపోతున్నాను"

"మిమ్మల్ని గురించి అలా ఎవరన్నారు ?" పార్టీశాఖ కార్యదర్శి అడిగాడు నెమ్మదిగా.

పోరాటంలో రాటుదేలినవాడు కావడంచేత అంతవరకు మౌనంగాను, ధైర్యంగాను ఉన్నాడు; కాని ఆ మాటవినేటప్పటికి అతని కళ్ళల్లో నీళ్లు నిండాయి.

చిట్టచివరకు పార్టీశాఖ అతని కోరికను ఆమోదించింది. ఇతర సైనిక కార్యకర్తలతోపాటు అతనినికూడ యుద్ధరంగానికి పంపటానికి ఒప్పుకున్నారు. తనకు ఒక చెయ్యి లేనప్పటికీ విప్లవ పోరాటం మొత్తంలో తనను గురించి అతడొక్కసారికూడ ఆలోచించుకోలేదు. తీవ్రమైన పోరాటం చెలరేగుతున్నచోట, అతిముఖ్యమైన పనిని నిర్వహించడానికి పార్టీకి సరిగ్గా అలాంటి మనిషే కావాలి.

ఒక వేసవి సాయంకాలం పెద్దపెద్ద వానచినుకులు పడుతుండగా అతడు యుద్ధరంగానికిపోయే రైలెక్కాడు. గత కొద్ది సంవత్సరాలుగా అతని అనుచరుడు లీ అతనికి ఎడమచేయివలె సాయపడేవాడు. కాని ఈసారి మాత్రం ఎవరి సాయం లేకుండానే

---

1. 1937లో చాంగ్ కై-షేక్‌తో జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటనకొరకు ఎర్ర సైన్యపు 5 నక్షత్రాల టోపీ మార్చవలసి వచ్చింది.

తన కొద్దిసామానును ఒక్కచేతితోనే మోసుకుంటూ బయలుదేరాడు. ఒక మిత్రుడు పంపిన ఖాకీ ఉలెన్ యూనిఫామ్‌ను బయల్దేరేముందే పంపేశాడు. ఎప్పటిమాదిరిగానే గ్రేట్‌వాల్ అవతలినుండి తెచ్చుకున్న, అందరికీ సుపరిచితమైన కాటన్ యూనిఫాం వేసుకున్నాడు. ఉతకగా ఉతకగా అది తెలుపురంగుకు వచ్చింది. బిగించిన బెల్టు, శుభ్రంగా, నీట్‌గా ఉన్న బట్టలతో పోరాటానికి సిద్ధంగా వున్నట్టనిపించిందతనికి.

వూ యుద్ధరంగానికి చేరుకున్నాడు. కాని పై అధికార్లు అతనిని యుద్ధానికి పంపడానికిబదులు సబ్‌డివిజన్ సైనికశాఖతో ఉంచాలని నిర్ణయించారు. ఒక పరిచితుని ద్వారా అది తెలుసుకున్న అతని ఉత్సాహం నీరుకారిపోయింది. ఆ మరునాడు ఊరి మధ్యనుండి గుఱ్ఱంమీద వెళ్తున్న వూకు కమాండర్ ఎదురయ్యాడు. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. అయినా గుఱ్ఱంమీదనుండి దిగకుండానే వూ దానిని దౌడుతీయించాడు. అతని గుఱ్ఱమొక విచిత్రమైనది. అది కోపంగా తన్నటం, కుదపటం మొదలెట్టింది. అయినా కుడిచేత్తో కళ్ళెం గట్టిగా పట్టుకున్నాడు. ఖాళీ ఎడమచెయ్యి గాలికి వూగులాడుతూంది. గుఱ్ఱంమీద పోతున్న అతనిని చూస్తుంటే కళ్లు చెమ్మగిల్లాయి కమాండర్‌కు. ఎర్రగా కనిపిస్తున్న ఆకాశాన్నీ, అతణ్ణీ మార్చి మార్చి కంటికి కనిపించినంతవరకు చూస్తూ నిలబడ్డాడు.

రెండవరోజు ఉదయం ఆ కమాండరు వూను ఆహ్వానించాడు. ఆ ఊరిలో నిన్న కొద్ది క్షణాలు చూడటమేతప్ప రెండు సంవత్సరాలనుండి ఒకళ్ళనొకళ్ళు చూడనే లేదు. ఆ కమాండరు మొదట ఒక డివిజన్ అధికారి. అతని నుదిటిమీద ఏర్పడిన గీతలు అతని 30 సంవత్సరాల వయస్సును 40 సంవత్సరాలుగా చూపుతున్నాయి. మంచూరియాలో రెండు సంవత్సరాలు కష్టనష్టాలకోర్చి పోరాడిన ఫలితమే ఇది. కాని ఖంగుమనే అతని నవ్వూ, చాంగ్ షా యాసగా మాట్లాడటంచూచి అతడు ఎప్పటిలాగే స్నేహపాత్రుడుగానే ఉన్నాడనుకున్నాడు వూ. కమాండరుంటున్నది ఒక రైతు పూరి గుడిసె. అందులో కొవ్వొత్తి వెలుగులో టేబుల్‌దగ్గర తెల్లని, పొడవైన ఒక అపరిచితుడు నిలబడి ఉద్రేకంగా మాట్లాడుతున్నాడు. అతడే ఎకోలన్ కమిస్సార్. అతడు వూ చేతిని తన చేతిలోకి తీసుకొని ఆప్యాయంగా నొక్కాడు. అంతలో కమాండరు టీ రొట్టెలను తెచ్చి వూ ముందుంచాడు. ఆ తర్వాత చేయవలసిన పనిని గురించి వారేమీ మాట్లాడుకోలేదు. ఎందుచేతనంటే పోరాటానికీ, పోరాటానికీ మధ్య ఎప్పుడో కాని విశ్రాంతి దొరకదు. అటువంటి సమయంలో వారి గతాన్ని గురించి, ప్రస్తుత జీవితాన్ని గురించి, అనేకమంది తెలిసినవాళ్ళను గురించి, పిచ్చాపాటిగా మాట్లాడుకుంటారు. సామాన్యంగా ఫలానా సంవత్సరంలో అని కాకుండా షాన్-చెంగ్-చెన్ పోరా

టం తర్వాత ఏం జరిగిందీ లేకపోతే త్యే-చియూ-యూ పోరాటం తర్వాత ఏంజరిగిందీ- ఇలా సాగుతుంటుంది వారి సంభాషణ. ఆ పోరాటాల్లో వారందరూ సమానంగా పాలు పంచుకున్నవాళ్ళవటంచేత యిప్పుడు జరుగుతున్న దానిని గతంతో పోల్చి మాట్లాడటం తేలికవుతుంది.

వూ జాగ్రత్తగా విన్నాడు. ఒక ప్రక్క దళాలను గురించి యింకా ఎక్కువ తెలుసుకోవాలనిపిస్తూంది. ఇంకొక ప్రక్క వాళ్ళతోపాటు యుద్ధరంగంలో ఎప్పుడూ కలిసి ఉండలేకపోయానే అని బాధపడుతున్నాడు. చివరికి వెళదామని వాళ్ల లేచి నిల బడుతుండగా మాత్రమే ఎకోలన్ కమీస్సార్ అధికారికంగా వూతో ఇలా అన్నాడు

"హెడ్‌క్వార్టర్స్‌నుండి నాకు సూచనలు వచ్చాయి మీరు పదవ రెజిమెంటుకు వెళ్ళండి. ఏమంటారు?"

ఉప్పొంగిపోతూ అందుకు అంగీకరిస్తూ తల ఊపాడు వూ.

"నా కింకేమైనా సూచనలున్నాయా, కమిస్సార్" అని అడిగాడు వూ.

"లేదు. ఆ విషయాలను గురించి నాకంటే మీకే ఎక్కువ తెలుసు. కార్యకర్త లకు సంబంధించి పరిష్కరించవలసిన సమస్యలు కొన్ని ఉన్నాయి"

వూ శాల్యూట్ చేసి వెనుదిరిగి వెళ్ళిపోయాడు. అప్పుడే ఒక సెక్షన్ ఛీఫ్ ఒక రిపోర్టు తీసుకొచ్చాడు. కమాండరు కొవ్వొత్తి పైకెత్తి పట్టుకొని మ్యాప్‌లు వేళ్లాడు తున్న గోడదగ్గరకు వెళ్లాడు... తిరిగి వచ్చేటప్పుడు వూ తాను విన్నదాన్నంతా మననం చేసుకున్నాడు. ఎకోలన్ హెడ్ ఆఫీసర్లిప్పుడు ఇదివరకటి కంటె ప్రశాంతంగాను, ఆశాజనకంగాను ఉన్నారు— అంటే ఇక్కడికి వచ్చినప్పటినుండి పోరాటం బాగానే సాగు తూందన్నమాట. కమాండరిప్పుడు ఒక డివిజన్‌ను మాత్రమేకాదు. చాల డివిజన్లను చూస్తున్నాడు. యుద్ధంలో అతిప్రియంగా ఉపయోగించేమాట వెంటనే గుర్తొచ్చింది, "బాగా గురిచూడండి, చావుదెబ్బ కొట్టండి!" ఫలితంగా యీ రెండు సంవత్సరాల పోరాటంలో వారు శత్రువును చావుదెబ్బ కొట్టారు.

వూ పదవ రెజిమెంట్‌లో పొలిటికల్ కమిస్సార్‌గా చేరటమేకాదు, శత్రువుతో జరిగిన రెండు సంఘర్షణలలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు.

మొదటి పోరాటంలో రైలురోడ్డు బ్రిడ్జివైపు నుండి మొదలుపెట్టి శత్రువును పట్టుకోవడం వారి ప్రధాన సమస్య. చివరికి శత్రువు ఒక కొండమీదకు చేరుకున్న తర్వాత పోరాటం తీవ్రతరమైంది. రెజిమెంటల్ కమాండ్ పోస్టు అడవిలో ఉంది. తుపాకీ గుండ్ల తాకిడివల్ల తెరలు తెరలుగా ఆకులు రాలిపడుతున్నాయి.

ఆ రెజిమెంటల్ కమాండర్ ఎర్రసైన్యంలో పేరుమోసిన లియు చీ-టాన్ నాయకత్వాన గతంలో పోరాడాడు. టెలిఫోన్ తీసుకుని సాధ్యమైనంత బిగ్గరగా ఏవో ఆదేశాలిచ్చి రిసీవరు పెట్టేశాడు. కొంతసేపు చెవులొగ్గి విన్నాడు. పోరాటరంగంలో గుళ్ళ వర్షం కురుస్తూనే వుంది.

క్రిందికి వంగి యుద్ధవ్యూహాలను శ్రద్ధగా పరిశీలించి వెంటనే అతడొక నిర్ణయాని కొచ్చాడు. శత్రుబలాల వ్యూహాన్ని దెబ్బతీయాలంటే ప్రాణాలకు తెగించి పోరాడగల బెటాలియన్ నొకదానిని పంపాలి. అది రెండవ ఎకొలన్‌కు అనుబంధంగా వుంది. ఎడమవైపునుండి దానిని యుద్ధరంగంలోనికి పంపాలి. అందుకు తగిన సమయం ఇదే ననుకున్నాడు. మీ సలహా ఏమిటని పొలిటికల్ కమిస్సార్ వూ నడిగాడు. ఏమాత్రం సంకోచించకుండా వూ దానిని బలపరచాడు.

"అలాగే కానివ్వండి, కామ్రేడ్ !" ఆ బెటాలియన్ ఎలా పోరాడుతుందో తనకు తెలియదే అని మనస్సులో అనుకుంటూ వూ పైకి మాత్రం అలా అన్నాడు.

కమాండర్ టేబిల్‌మీద గట్టిగా గుద్దుతూ "అయితే- మనం వెళదాం" అన్నాడు.

వెంటనే చెయ్యి చాచి ఫోనందుకున్నాడు కమాండరు. సైనికులకేవో ఆదేశాలిచ్చాడు. కొద్ది నిమిషాల్లో యిదంతా ముగించుకొని షాక్ దళాలున్న చోటికి గాలివలె దూసుకుపోయాడు. తనలో తనే నవ్వుకుంటూ కమిస్సార్ అడవిదాటాడు. కొంత దూరాన ఉన్న కొండమీద మంటలు, పొగ దట్టంగా ఆవరించి ఉండటం చూచాడు. ఆ కాల్పులవల్ల భూమ్యాకాశాలు బద్దలయ్యేటంత చప్పుడు వినవస్తూంది. అయితే వూ అనుకున్నట్టుగానే ఇరవై నిమిషాల తర్వాత పోరాటం పూర్తిగా ఆగిపోయింది. ఒకరితో ఒకరు మాట్లాడకపోయినా అతడూ, రెజిమెంటల్ కమాండరూ ఒకే అభిప్రాయంతో ఉన్నారు.

అమ్మయ్య అన్నట్టుగా వూ ఒక నిట్టూర్పు విడిచాడు. క్రిందటి రాత్రి వర్షం కురిసింది; శిశిరంలోరాలిన ఆకులతో కూడిన పల్లెపట్టు తేమగాలి ఆహ్లాదం కలిగిస్తూంది. ఒక నిమిషం ముందు తన యూనిట్ పోరాటశక్తిని గురించి తనకేమీ తెలియదనుకున్నాడు. అది నిజం కానేకాదు. ఏమైనా ఎప్పటిలాగే జాగ్రత్తగా ఆలోచించసాగాడు. తాను ఇక్కడ లేనప్పుడు తన యూనిట్‌లో ఏమైనా మార్పులు జరిగాయా ? లేక నాలోనే ఏదైనా మార్పు వచ్చిందా ? ఇదివరకటి గెరిల్లాదళాల అనుభవం యింకా ఉపయోగపడుతూందా ? అలాంటి పేరుపొందిన రెజిమెంట్‌లో ఉండడమే తనకు అత్యంత గౌరవప్రదమనుకున్నాడు. అటువంటి గౌరవం ఎట్టి పరిస్థితులలోను తనమూలంగా వీస

మంతైనా దెబ్బతినరాదనే స్థిరనిశ్చయానికొచ్చాడు కనుకనే యింత పరిపూర్ణమైన జాగ్రత్త అవసరమైంది. ఈ రెజిమెంట్‌లోని ఒక కంపెనీ చింగ్-కాంగ్-షాన్ సమయంనుండీ పందొమ్మిది సంవత్సరాలూ యుద్ధరంగంలో తన కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ వచ్చింది. ఇప్పుడు ఆ కంపెనీలోగాని, కనీసం రెజిమెంట్‌లోగాని మొదట ఉన్నవాళ్లు ఒక్కరూ మిగలకపోయినప్పటికీ ఆ కంపెనీయొక్క వీరోచిత పోరాట సంప్రదాయాన్ని మాత్రం అలాగే నిలుపుకుంటూ వచ్చింది. ఛైర్మన్ మావో ప్రత్యక్ష నాయకత్వాన పోరాడటంవల్లనే ఆ ప్రత్యేకతను పొందగలిగిందని కమిస్సార్ అభిప్రాయం. ఈ కంపెనీతో కలిసివున్న బెటాలియన్‌లోనే రెజిమెంటల్ కమాండర్ పోరాడమని ఆదేశించాడు. అందుకే వూ నిశ్చింతగా ఉన్నాడు. ఇప్పుడు అతనిచుట్టూ గుళ్ళవర్షం కురుస్తూంది. వాచీ తీసి అతడు టైం చూచుకున్నాడు. ఇక పదినిమిషాల్లో తాను పోరాటరంగానికి పోవలసి ఉంది.

అతడక్కడికి చేరుకొనకముందే, ఇంకా కొండమీది అడవి దాటుతుండగానే, పోరాటం ఆగిపోయింది.

ఉదయభానుని అరుణకిరణాలతో యుద్ధరంగం ప్రకాశవంతమౌతూంది. వూ ప్రతి యోధుణ్ణి పలకరించి హృదయపూర్వకంగా అభినందించాడు.

ఐదునిమిషాల ముందు శత్రు కమాండ్‌పోస్టు ప్రధానమెషిన్‌గన్‌ను నిలిపిఉంచిన చెట్టుకింద రెజిమెంటల్ కమాండర్‌తో కలిసి అతడు సిగరెట్ తాగాడు. తన దళాలు ఇదివరకటికంటే ఎక్కువ ధైర్యసాహసాలు ప్రదర్శించి పోరాడినందుకు వూ చాల సంతోషించాడు.

(ఇంకా వున్నది.)

సమీక్ష :

## నూతన ప్రజాస్వామ్య సాంస్కృతిక విప్లవ సైనికుడు వరవరరావు 'ఊరేగింపు' పరిశీలన

సాహితీ రంగంలోనేకాదు, మరి ఏ రంగంలో అయినా కొందరు వ్యక్తులుగా వెలుగులోకివస్తారు. మరికొందరు శక్తిగా, ఉద్యమంగా, సమిష్టిగా ప్రజల ముందుకు వస్తారు. ఇది వ్యక్తులు ప్రాతినిధ్యం వహించే ఆశయాలమీద ఆధారపడి వుంటుంది. శాస్త్రీయమైన ఆశయాలు, చిత్తశుద్ధి, పోరాటస్వభావం చారిత్రకదశా ప్రాతినిధ్యంఉన్న వ్యక్తి సంస్థగా పనిచేయగలుగుతాడు. "The superior people are those who understand the times" (చైనా సామెత) యుగనాడిని అవగాహనచేసుకోగలిగిన వాళ్ళను ఉన్నతమైన ప్రజలుగా చెప్పవచ్చును. మానవ కార్యకలాపాలన్నిటికీ యుగశక్తిమూలం. ఈ యుగశక్తి పరిమితుల్లోనే విజ్ఞానశాస్త్ర, కళారంగాలు వికసిస్తాయి.

భవిష్యత్తుకోసం అవిరామంగా పోరాడుతున్న శక్తుల సమూహాన్ని యుగశక్తి అన వచ్చును. దారుణమైన అంధకారగర్భంలో ప్రగతికిరణాలను ప్రసరింపజేసేవాడు ఉద్యమ శీలి। ఫ్యూడల్ సమాజం, అంతర్, బహిర్, వైరుధ్యాల ఘర్షణలో ఉన్నత అస్తిత్వాన్ని కోల్పోయింది. ఈ క్షీణయుగంలో కందుకూరి, గురజాడలు సమకాలికతకోసం పోరాటం చేశారు. అందుకే వాళ్ళు వర్తమాన చరిత్రలో వ్యక్తులుగా గాక శక్తులుగా నిలబడ్డారు. జయంతి రామయ్య పంతులు, వేదం వెంకటరాయశాస్త్రి మొదలైనవాళ్ళు కూలిపోతున్న చారిత్రకదశ వుచ్చస్థితిని కాపాడటానికి బృహత్తర ప్రయత్నంచేసి కూడ చరిత్రలో వ్యక్తిమాత్రులుగా మిగిలిపోయారు. ఒక కొత్తసమాజ వుదయాన్ని గూర్చి పాడేవాడు, ఆవుదయాన్ని అడ్డంకుల కారుమేఘాలనుంచి కాపాడటానికి పోరాడేవాడు, ఆ వుదయకిరణాల కాంతిని ఆహ్వానించేవాడు శక్తిగా విస్తరించి, సంస్థగా పరిణతి చెంది ఉద్యమంలో సైనికుడుగా అగ్రగామి అవుతాడు. గడిచిపోయిన యుగాల భావాలకు ప్రాతినిధ్యం వహించేవాడు ఎంత వ్యక్తిగత నైపుణ్యంవున్నా కేవలం ఒక వ్యక్తిగా మిగిలిపోతాడు. క్రాంతి శక్తుల మధ్య బొగ్గుబొమ్మలా, పాలకవర్గాల వాడినదండలను మోస్తూ ఒక పురాతన వ్యక్తి శిథిల విశేషంగా కనిపిస్తాడు. పురోగామి సిద్ధాంత సముద్రపుఅలల తాకిడికి అరిగి కరిగిపోతాడు.

వరవరరావు వ్యక్తిమాత్రుమేకాదు, శక్తి. కవితా కుతూహలంతో కలంపట్టిన వాడుకాదు, కవితా కదనరంంగలో కలాన్ని ఆయుధంచేసుకున్నవాడు నెహ్రూనుంచి మావో వరకు తిలక్ నుంచి సుబ్బారావు పాణిగ్రాహివరకు సంఘర్షణాత్మకమైన పరిణతి సాధించినవాడు. అస్పష్టమైన వామపక్ష పక్షపాత వాసనలనుండి సాయుధ ప్రజా రాజకీయాలలోకి మేల్గొన్నవాడు. యుగజీవనాడిని పసికట్టి పరుగులమీదగాక తనుమారుతూ తన ఆలోచనా విధానాన్ని నిరంతర అన్వేషణతో సామాజికీకరణం చేసుకున్నవాడు. అసంఘటిత భావజాలం నుంచి సంఘటిత సిద్ధాంత ఆయుధాన్ని చేపట్టినవాడు. సంఘ భౌతిక జీవితపు మంటలనుంచిలేచే జ్వాలలే సిద్ధాంతాలు. ఏవర్గానికి ఆవర్గపు సిద్ధాంతం ఉండనేవుంటుంది వర్గసమాజంలో సిద్ధాంతాలు వర్గశీలాన్ని పొందుతాయి. ప్రకృతి, చరిత్ర మొదలైన అన్ని విషయాలకు నిశితంగా వర్గప్రాతినిధ్యంవహించే మేధావులు రచయితలు ఉంటారు. వర్గపోరాటంలో వర్గాల ప్రయోజనాలను కాపాడటానికి మేధావులు ప్రాతినిధ్యం వహిస్తారు. వరవరరావు విప్లవకవి. ప్రజాపోరాటాలు విప్లవసిద్ధాంతాన్ని విప్లవీకరిస్తాయి. "with out a revolutionary theory there can be no revolutionary movement" (Lenin). విప్లవ సిద్ధాంతంలేకుండా విప్లవోద్యమంలేదు. ఈనాడు దేశంలో కొనసాగుతున్న విప్లవం నూతన ప్రజాస్వామిక విప్లవం. నగ్జల్‌బరీలోరగిలి దేబ్రా, గోపీవల్లభపూర్, బీర్భూంలలోను, శ్రీకాకుళం, తెలంగాణా

జిల్లాలలోను, ఉత్తరప్రదేశ్ లఖింపూర్, ఖేరాలలోను, బీహారులోని ముషాహరిలోను జరిగిన రైతాంగ పోరాటాలన్నీ దీర్ఘకాలిక స్వభావం కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్భాగాలే. నూతన ప్రజాస్వామిక విప్లవం అధిక సంఖ్యాక ప్రజలను విముక్తి చేస్తుంది. కాబట్టి ప్రజాస్వామ్య స్వభావంకలది. భూస్వామ్య, బడాబూర్జువాల నుంచి రాజకీయాధికారం కార్మికనాయకత్వాన రైతాంగ, ప్రగతిశీల బూర్జువా ఐక్య సంఘటితశక్తి కైవసంచేసుకోవటమే నూతన ప్రజాస్వామిక విప్లవం. పాత ఆర్థిక విధానాన్ని, పాత రాజకీయ విధానాన్ని, పాత సంస్కృతిని నిర్మూలించి కొత్త ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక శక్తుల్ని నిర్మించటమే నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యం. ఈ విప్లవం ప్రధానంగా సాయుధపోరాట రూపంలోనే కొనసాగుతుంది. ఏ యుగంలో సంస్కృతి అయినా ఆదశలోని ఆర్థిక, రాజకీయ విషయాల ప్రతిబింబమే. ఒక చారిత్రకదశలోని ఆర్థిక, రాజకీయరూపాలు ఆదశలోని సాంస్కృతిక రూపాలను నిర్ణయిస్తాయి. అప్పుడే సాంస్కృతిక రూపాలు తిరిగి ఆర్థిక, రాజకీయ విషయాలమీద ప్రభావం చేయగలుగుతాయి. పాతరాజకీయ, ఆర్థిక విషయాలనుంచి పాతసంస్కృతిని ఎలా విడదీయలేమో అలాగే కొత్త రాజకీయ, ఆర్థిక విషయాలకోసం జరిగే విప్లవ పోరాటాలనుంచి కొత్త సాంస్కృతిక విప్లవాన్నికూడా విడదీయలేం. విప్లవసాహిత్యం ప్రజల బలమైన ఆయుధం.

"Before the revolution comes, revolutionary culture prepares for it in the ideological field. During the revolution, it is a necessary and important sector in the general revolutionary front"

– MAO.

విప్లవానికి పూర్వం విప్లవ సంస్కృతి భావరంగాన్ని విప్లవానికి సిద్ధం చేస్తుంది. విప్లవకాలంలో విప్లవ సంస్కృతి విప్లవానికి అత్యవసరమైన, ప్రధానమైన అంగంగా పనిచేస్తుంది. ఈ రెండు దశలు పరస్పర విరుద్ధమైనవికావు వీటి మధ్య గతితార్కిక సంబంధం ఉంది ఈ రెండు బాధ్యతలను విప్లవకవులు నిర్వహించవలసింది. నూతన ప్రజాస్వామిక విప్లవంలో సాంస్కృతిక సైనికులుగా పనిచేయడం విప్లవ రచయితల సంఘం ప్రణాళికలో ప్రధానాంశం.

వరవరరావు సిద్ధాంతబలం వున్న అగ్రగామి విప్లవకవి. చాలామందిలా ఏదో తోచినట్టు ఆరంభించి చివరిలో మకుటంలా అడవిని దిక్సూచిగా చూపడంకాక మొత్తం రచన అనుభవక్రమంలో అలలు అలలుగా సిద్ధాంతాన్ని జీవితపరంగా, సంఘపరంగా చెప్పటం వరవరరావు కవిత్వంలో విశిష్టలక్షణం. సిద్ధాంతాన్ని ఆత్మాశ్రియంగా చెప్పటం ఒక పద్ధతి. ఇది బాగా నలిగిన పాతపద్ధతి. సమష్టి స్వభావంతో, సమూహ సం

స్కారంతో చెప్పటం వరవరరావు పద్ధతి. ఇది కొత్త పద్ధతేకాక పోషలిస్టు వాస్తవికత గమ్యంలోకి పోవలసిన నూతన ప్రజాస్వామిక వాస్తవికతకు శాస్త్రీయమైంది. దాన్నే విప్లవ కవిత్వంలోని నూతన ప్రజాస్వామిక కవిత్వం అనవచ్చును. "National in form, New democratic in content'' అనేది దాని ప్రధాన లక్షణం. వాస్తవాలనుంచి సత్యాలను సూత్రీకరించటం, ఆచరణకు, ఆశయానికి, ఐక్యత సాధించే అనుభవాలకు కళారూపం యివ్వటం నూతన ప్రజాస్వామిక వాస్తవికత. ఈ వాస్తవికతే వరవరరావు "ఊరేగింపు" కవితల్లో వస్తువు. "ఏగూటి చిలక ఆగూటి పాట" లో వర్గసమాజ స్వరూపాన్ని సూటిగా స్పష్టం చేశాడు. రాజ్యాంగం మొదలు వుపరితలమంతా వర్గస్వభావంతో కూడి వుంటాయన్న మౌళిక సత్యానికి ఈరచన రూపకల్పన. నగరాల్లో ప్రభుత్వం బలంగా వుంటుంది. గ్రామప్రజల రక్తాన్ని నగరాలుపీలిస్తే నగరాల రక్తం మీద సామ్రాజ్యవాదం బలుస్తుంది. వ్యవసాయ దీర్ఘకాలిక పోరాటం పల్లెలను విముక్తి చేసి పట్టణాలను ఆవరిస్తుంది. ఈ పోరాట సత్యాన్నే

"ప్రతి చెట్టు రహస్యాన్ని దాస్తుంది
విప్లవాన్ని పూస్తుంది."

"నగరమే పులి అయినప్పుడు
ప్రజలు అడవుల్లో తలదాచుకోకతప్పదు
మాటుకాచి పులిని
కూల్చేయటమూ తప్పదు"

(నగరమే పులి అయినప్పుడు) అనే వాక్యాలలో చెప్పాడు.

ఏజన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న సాయుధ ప్రజాపోరాటానికి ఆహ్వానాలు.

"ఆశయం అమ్మగా
బాధలే విలుగా
తెలుగు కోపం ఎర్ర
వెల్తుర్లు చిమ్మింది.
కొండల్లో, కోనల్లో
గుండెల్లో, కానల్లో
నిండిపోయిన వెలుగు
ఎలుగెత్తి పిలిచింది
యువకులారా రండి
యోధులారా రండి."

(కాముణ్ణి చంపి వాని నెత్తురుతో వసంతాలు చల్లుకుందాం)

తనతో కలసి గిరిజన పోరాటంలోకి విప్లవ వర్గాలను ఆవాహన చేస్తున్నాడు.

"తుపాకీని తుపాకీతో ఎగురగొట్టమని ప్రజలకు చెప్పి యీ వ్యవస్థ భద్రతను భంగం చేసాను నేను" (శాంతి భద్రతలు)

"బానిస సమాజం నుంచి
బానిస భావంకూడాలేని కమ్యూనిజందాకా
పయనించే యీ కత్తులవంతెనమీద
ఎంతోదూరం నడిచి వచ్చావు
ఇంకెంతదూరమైనా ముందుకే సాగు"

(వెనక్కి కాదు, ముందుకే)

పెట్టుబడిదారీ భూస్వామ్య దేశాలన్నీ ప్రజల్ని మిలిటరీ బలగాల సాయంతోనే పరిపాలిస్తున్నాయి. (తమ ఆయుధాలకు మార్కెట్టుకోసం సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలను సృష్టిస్తున్నాయి) ఆయుధ సహాయంపేరుతో సామ్రాజ్యవాద రక్తపిపాస పెరుగుతోంది. దేశాలమధ్య యుద్ధాలేకాక వర్గయుద్ధాలుకూడా సాయుధరూపాన్ని అనివార్యంగా తీసుకుంటున్న యుగమిది. అందుకే 'తుపాకి గొట్టంద్వారా రాజ్యాధికారం' అనేది ఎజండాలోకి వచ్చింది. ఆ విషయాన్నే వరవరరావు 'శాంతిభద్రత'ల్లో చెప్పాడు. మన దీర్ఘకాలిక పోరాటం బానిస సమాజంనుంచీ కమ్యూనిస్టు సమాజంలో చరిత్ర చేరుకునేమార్గమంతా విప్లవాలమార్గమే. ఆ మార్గం 'కత్తులవంతెనే'. ఈ చారిత్రక విప్లవ సత్యానికి 'వెనక్కి కాదు, ముందుకే' అనే వరవరరావు రచన దర్పణం.

"ఊరేగింపు" కవిత నేటి విప్లవ వాస్తవికతకు చైతన్యవంతమయిన రూపం. నూతన ప్రజాస్వామ్య విప్లవ రంగాల్లో మమేకం చెందుతున్న విప్లవ వర్గాల, విప్లవ సిద్ధాంత చైతన్యాల విద్యుత్కేంద్రం ఊరేగింపు. 'విప్లవం వర్ధిల్లాలి' వంటి నినాదాలు కూడా సిద్ధాంత వుత్తేజంతో కవితామయంగా సాక్షాత్కరించాయి. నినాదాలు కవిత్వం కాదనేవాళ్ళకి ఈ రచన గుణపాఠం. "వేల కంఠాల ఆశల తరంగాలువీస్తున్నఝంఝ" ఊరేగింపులో మహోద్యమ శీలంగా కనిపిస్తుంది. వరవరరావు సమిష్టి సంస్కారానికి, సామూహిక శీలతకు ఈ రచన కవితామయ నిదర్శన. వరవరరావు వ్యక్తిత్వంలోని సంస్కార స్వభావం, శక్తిశీలం వూరేగింపులో ప్రత్యక్షరం సాక్ష్యమిస్తుంది. ఊరు ఎరిగేటట్టు చేయడం వూరేగింపు. మొత్తం సాయుధపోరాట రాజకీయాలను, వూరు ఎరిగేటట్టుచేశాడు. వాస్తవానికి యీ అర్థంలో 'ఊరేగింపు' కవితలన్నీ వూరేగింపులే.

ఒక వ్యక్తి అభిమానించే వీరుణ్ణిబట్టి ఆ వ్యక్తి వర్గస్వభావాన్ని అంచనా వేయవచ్చు. వీరారాధన అనేది ప్రాచీన కాలంనుంచీ వుంది. మధ్యయుగాల్లో కవులందరూ రాజుల్ని, మంత్రుల్ని, పాలెగాళ్ళను (కొన్నిసందర్భాలలో దేవుణ్ణి) ఆరాధిస్తూ రచనలు చేసినవాళ్ళే. "కరికరిభిత్, గిరిగిరిభిత్" కబుర్లతో పొగిడినవాళ్ళే. వీటిల్లో అబద్ధాలు, అతిశయోక్తులు, కవి వ్యక్తిగతస్వార్థం ఎక్కువగా వుంటాయి. జానపదసాహిత్యంలో సర్వాయిపాపడులాటి వీరులగాథలున్నాయి. ఇక్కడ ఆ వీరుల్లో ఫ్యూడల్ వాసనలు వున్నా జానపదుల చిత్తశుద్ధి హృదయనైర్మల్యం కనిపిస్తాయి. బూర్జువా కవులు వుద్యమంలో పాల్గొన్న ప్రజల్ని వుద్యమలక్ష్యాలను విస్మరించేవిధంగా నాయకులను ఆరాధిస్తారు. వీళ్ళలో రుజుత్వంకన్నా, విషయపరిజ్ఞానంకన్నా ఉత్సాహం పక్షపాతం కనిపిస్తాయి. ఇంతవరకు వీరకీర్తన అంతా హేతుబద్ధంకాని, ఆలోచనాత్మకంకాని వ్యక్తిపూజస్థాయిలోనే వుంటుంది. విప్లవ కవులు విప్లవకారులను సంకీర్తనం చేయటానికే

వున్నారని కొంతమంది విప్లవకవులే చిత్రించటం జరుగుతున్నది. అధిక సంఖ్యాక ప్రజల విముక్తి కోసం ప్రాణాలను అర్పించిన విప్లవకారుల్ని కీర్తించటం సహజమే. అయినా విప్లవకవుల ప్రధానధ్యేయం అదికాదు. 'కీర్తించటం'అనే మాటలో అతిశయోక్తులలో హేతుబద్ధంకాని వ్యక్తి వర్ణన స్ఫురిస్తుంది. వుద్యమంలో ఒకడుగా, అగ్రిగామిగా, ప్రజలను వున్నత లక్ష్యాలవైపు పురోగమింపచేసే సిద్ధాంతవేత్తగా ఆచరణ, ఆదర్శాలు కలిసిన నవమానవుడుగా విప్లవకారుణ్ణి చిత్రించవచ్చును. కవి ఆశయాలు, చిత్తశుద్ధి, సిద్ధాంతదృష్టి, ప్రజాపక్షపాతం విప్లవకారుని ఆశయాలతో మమేకంచెందాలి. అమరులైన వీరుల గాథలను గానం చేయడం, వాళ్ళను త్యాగధనులుగా, మహాపురుషలుగా చిత్రించటంమీద దృష్టి మళ్ళిస్తే వాళ్ళు "విగ్రహమహాత్ములై"పోతారు. అమర వీరుల గురించి రాయటంకంటె సజీవులుగా వుండి పోరాడుతున్న ప్రజాజీవుల గూర్చి రాయటం విప్లవ కవుల కర్తవ్యం. ఈ అర్థాన్నే

> "To find heroes in the grand manner we must look rather in the present," –MAO

అని మావో చెప్పారు. వరవరరావు ఈ వాక్యాన్ని ఊరేగింపు మొదటిపేజీల్లో వుల్లేఖించాడు. నేటి హీరో ఎలావుంటాడు?

"కసితో స్వార్థం శిరస్సు గండ్రగొడ్డలితో
నరకగలిగినవాడే నేటి హీరో
ప్రజలగుండెల కొండల్లో మాటుకాసి
ట్రిగర్ నొక్కగలిగినవాడే ద్రష్ట"

ఈ నవమానవుడే వరవరరావు హీరో. ఈ విప్లవవీరుడు ప్రజలమధ్య ఒకడుగా, విప్లవోద్యమం అగ్రగామిగా, విప్లవ సిద్ధాంతం వూపిరిగా శాస్త్రీయంగా, సాయుధంగా చరిత్ర పుటలపై ఎర్రపాదాలను ముద్రిస్తూ ముందుకుపోతున్నవాడు. కవిగా వరవరరావు ఈ నవమానవునితోపాటు సాంస్కృతికంగా పురోగమిస్తున్నాడు. అందుకే వరవరరావు శ్రీకాకుళ గిరిజన నాయకుడు సత్యం, ప్రగతిశీల విద్యార్థి నాయకుడు జార్జి రెడ్డి, మార్క్సిస్టు-లెనినిస్టుపార్టీ నాయకుడు చారుమజుందార్‌లకు విప్లవజోహార్లు అర్పించాడు. ఈ ముగ్గురు అమరవీరులను వ్యక్తులుగాగాక శక్తులుగా, ప్రజాపోరాటక్రమంలో విద్యుత్కేంద్రాలుగా వరవరరావు ఆలోచనాత్మకమైన సైద్ధాంతిక ఆవేశంలో చిత్రించాడు. 'సత్యంవధ'లో సత్యంమాష్టారు కేవలం వ్యక్తిగాగాక విప్లవ సచ్ఛక్తిగా వర్గ కసితో గిరిజనులతోపాటు లేచిన సాయుధ పోరాటజండాగా ఒక సజీవపోరాట ప్రవాహంగా ఆలాపనచేస్తూ వర్గ పోరాటరాజకీయాలనుకూడా స్పృశించాడు.

"సత్యాన్ని హత్యచేశానని వెర్రివెంగళప్ప విర్రవీగాడు"

"నిరుపేదల హృదయాల్లో బానిసత్వం నివురు" తొలిగించి రగుల్తున్న "సమతా సత్యాన్ని" ఎవరుచంపగలరు? "వడ్డీవ్యాపారుల, భూస్వాముల గుండెల్లోకి గురిపెట్టిన గిరిజనుల వింటినుంచి దూసుకొచ్చిన" సత్యాన్ని ఎవరు వధించగలరు? వ్యక్తిగా సత్యం అమరుడుకావచ్చు. కాని శక్తిగా ప్రజాపోరాట సత్యంగా సత్యం సజీవుడే. సత్యం రగిలించిన సత్యం సత్యంతోపోయేదికాదు. ఇంకా రగిలి రగిలి కార్చిచ్చులా వర్గ సమాజాన్ని దహిస్తుంది. ఇలా వ్యక్తిపరిధినిదాటి ప్రజాపోరాటాలకు మారుపేరుగా, గిరిజనుల హృదయంగా సజీవ సత్యాన్ని వరవరరావు

"ఎర్రజెండా ఇంత ఎరుపేమిటని అడుగ
సత్యం రక్తంతో తడిసేనని చెప్పాలి"

అన్న శ్రీకాకుళ పోరాటసత్యం మార్గంలోనే చెప్పాడు.

జార్జిరెడ్డి విద్యార్థినాయకుడు. శాస్త్రవిజ్ఞానంలో పరిశోధనచేస్తున్న సమరవిద్యార్థి. మతోన్మాదులైన ముసలి విద్యార్థులు, పోలీసులతో కుమ్మక్కయి పట్టపగలు జార్జిని హత్యచేశారు. ఈ యువవీరుని అరుణస్మృతే 'జిందాబాద్'అనే రచన, ఒకతరంకోసం చచ్చేవాడు ఆతరాన్ని ఉజ్జ్వలంచేస్తున్నాడు.

"చంద్రగ్రహణంరోజు సముద్రస్నానాల్‌చేసి
నోబెల్ ప్రైజులుపొందిన శాస్త్రవేత్తలు
సాయిబాబాల కళ్ళల్లో, జూలులో, కాలిధూళిలో
ఆత్మపరమాణు పరిశోధనలుచేస్తున్న
భౌతికశాస్త్ర సూర్యులూవున్నారు మనదేశంలో" (జిందాబాద్)

ప్రకృతిశాస్త్ర విజ్ఞాన సంబంధ విషయాల్లో అశాస్త్రీయదృష్టి ఉండటం సామాజిక శాస్త్ర విషయాల్లో భ్రమాత్మక, హేతువాద విరుద్ధదృష్టివుండటం బూర్జువా మేధావుల, శాస్త్రజ్ఞుల లక్షణం. జార్జి ఈ బూర్జువా వలలో పడలేదు- విమర్శ విప్లవ ఆయుధంగా శాస్త్ర విజ్ఞానాన్నిగుర్తించి ఆచరణలోపెట్ట ప్రయత్నించాడు. జార్జిని హత్యచేయటానికి కారణం శత్రుపరంగాను, జార్జిపరంగాను వరవరరావు చెప్పాడు.

"గిరిజన హృదయాల్లో
మండుతున్న బాధల సత్యాన్ని
ప్రతీకార సత్యాన్నీ
బాణంలా విల్లుమీద గురిపెట్టిన సత్యాన్ని
చచ్చినా చచ్చిందని ఒప్పుకోరు జనం" (జిందాబాద్)

"చావుకూడా బతుకుకన్నా విలువైన త్యాగంగా" అనేదానికి నిదర్శనంగా చెపుతున్నట్టు కనిపించే ఈ వాక్యాలు జార్జి హత్యకు కారణం చెపుతున్నాయి. ప్రజా పోరాటాలవైపు విద్యార్థుల్ని సమీకరించటమే కారణం. ఫాసిజం, కాజోయే జనశాస్త్రవేత్తను బలితీసుకుంది.

'నక్‌సాల్‌బరీ నక్సల్‌బరీ' "చావలే చావలే చారుమజుందార్" అనే గేయాలు మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీనాయకుడు చారుమజుందార్‌కు చేసిన విప్లవాంజలి. రొమాంటిక్ వీరారాధనగాగాక సైద్ధాంతిక విప్లవ ఆలోచనగా, లావాలా ప్రజ్వలిస్తున్న ప్రజా పోరాటశక్తిగా చారూను వరవరరావు చిత్రించాడు. "ఒక ప్రపంచ నూతన మానవ ఆలోచన"గా "ఎర్రభయం సృష్టించి వుద్యమాన్నే ఆక్సిజన్"గా స్వీకరించిన పోరాటశీలిగా "నూతన ప్రజాస్వామ్య ఎర్రజండా ఎగరేసిన" విప్లవనాయకుడుగా "రైతాంగ పోరాటపంథాను" ప్రకటించిన పీడితజన నాయకుడుగా "వర్గశత్రు గుండెల్లో నిద్రపోయిన" చారుమజుందార్ "స్వప్నాలు వెలిగించ సాగిపోతామ"ని ప్రజలతరపున వరవరరావు మాటఇస్తున్నాడు. సాంస్కృతికంగా ఆ మార్గంలోనే పయనిస్తున్నాడు.

'లెనిన్'గేయంలో వరవరరావు అంతర్జాతీయ శ్రామికతను, ప్రపంచ విప్లవాల ప్రతీకగా లెనిన్‌ను చిత్రించాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని శ్రమజీవుల ఆయుధంగా ఆచరణలో నిరూపించాడు లెనిన్. ప్రపంచ పోరాటాలకు చైతన్యం లెనిన్. లెనిన్ వ్యక్తికాదు. అవిచ్ఛిన్న శక్తి.

1917 లెనిన్
1949 లెనిన్

భారత దేశంలో ఉదయించిన వ్యవసాయిక విప్లవం లెనిన్. ప్రతి ప్రజాయుద్ధం లెనిన్. రివిజనిస్టులు అర్ధాంతరంగా ఆపివేసిన తెలంగాణా పోరాటంలోని లెనిన్ మళ్ళీ నక్సల్‌బరీలో ఆయుధం ఎత్తాడు.

"తెలంగాణా పోరాటంలో
భుజంమీద తుపాకులు మోసి,
నక్సల్‌బరీ రైతాంగ పోరాటంగాకా
ఎక్సైల్‌లోవున్న గెరిల్లా లెనిన్" (లెనిన్)

అందుకే లెనిన్ పీడితుల ఆయుధం. లెనిన్ విప్లవాచరణ. మొత్తం లెనినిజాన్ని అంతర్జాతీయ పోరాటాల సజీవ ప్రతీకగా 'లెనిన్' రచనలో వరవరరావు వుత్తేజకరంగానూ, శాస్త్రీయంగానూ చిత్రించాడు. "లెనిన్ విగ్రహం కాదు విప్లవం" అని నిరూపించాడు.

ఈ గేయం ఒక కారణంగా తీవ్రవిమర్శకు గురైంది. అది

"ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో
ప్రజావెల్లువను పసికట్టింది లెనిన్" (లెనిన్)

అన్న వాక్యాలు. ఈ వాక్యం రివిజనిస్టులకు కంపరం పుట్టించింది. ప్రత్యేక తెలంగాణా వుద్యమంలో అసంఖ్యాక ప్రజలు పాల్గొన్నమాట వాస్తవం. ఇక్కడ వరవరరావు వుద్యమానికి నాయకత్వం వహించిన భూస్వామ్య శక్తుల్ని సమర్థించలేదు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని విప్లవోద్యమం అనటంలేదు. ఈ వుద్యమంలో" ప్రజావెల్లువను పసికట్టి" మార్క్సిస్టు-లెనినిస్టులు సాయుధ రాజకీయ ప్రచారానికి వినియోగించుకున్నారని వరవరరావు అభిప్రాయం. లేకపోతే చెన్నారెడ్డిలాటివాళ్ళను 'లెనిన్'అనడుగదా! ఇందులో ఖండించదగ్గ విషయం ఏముంది, ప్రజావుద్యమాలకు దూరమై రివిజనిస్టులు పరిశీలననుకూడా కోల్పోయారు. అమరవీరులను గురించి రాసేటప్పుడు వ్యక్తులుగాగాక శక్తులుగా వుద్యమదృష్టితో రాయడం వరవరరావు పంథా.

ప్రక్రియ, భావ ప్రతిమలు, భాష, శిల్పంలో ప్రధానాంశాలు వస్తు శిల్పాల సమ్మేళనం కవి సాధించాలి. 'పాట' అనేది చాలా ప్రాచీనమైన ప్రక్రియ. కవిత్వం పాటతోనే ఆరంభమయిందని సాహిత్య చరిత్రకారులు చెపుతారు. పాటలో గీతమాధుర్యం గుండెతలుపులను తెరుస్తుంది. సంవేదనామార్గంలో దీన్ని బోధనాశక్తి వుంటుంది. వస్తుప్రాధాన్యంకంటె అనుభూతి సాంద్రత ఎక్కువ. వరవరరావు పాటలు గణనీయంగానే రాశాడు. 'మాపటోళ్ళే రేపటోళ్ళు', 'ఎన్నికల పాటలు', 'నక్సల్‌రవ్వ' వరవరరావు పాటలు. 'నక్సల్‌రవ్వ' మంచి సిద్ధాంత గీతం.

"అడవులను అణచుటకు నగరాలు నడిచినవి", "సంద్రాన్ని చల్లార్చ వాహినులు కదిలినవి", "దీపాలు గాలిలో దేవుణ్ణి నమ్ముకునే, చుక్కలాకాసాన చెట్టేమొ కదలదు" మొదలయిన భావప్రతిమలు సామాన్య పాఠకులనుకూడా కదిలిస్తాయి. ఎన్నికల బహిష్కరణ ప్రధానంగా గ్రామీణ రైతులకు చెప్పాలిగాబట్టి పాటగా కూలన్న, రైతన్నలను వుద్దేశించి చెప్పాడు.

వర్గకసిని చంపే ఎన్నికలను బహిష్కరిస్తూ వరవరరావు పాటలురాసాడు. శ్రిమజీవుల వ్యవహారంలోవుంటే పదజాలాన్ని పాటలలో ఎక్కువగా ఉపయోగించటం జరిగింది.

వచన కవితాప్రక్రియలో ఈనాటికవుల్లో, అగ్రిగామికవుల్లో వరవరరావు ఒకడు. జిందాబాద్, లెనిన్, రక్తస్వప్నం, నగరమే పులి అయినప్పుడు, ఆధునిక వచన కవిత్వంలో శక్తివంతమైన రచనలు. "చేతనావర్తం"కవుల్లా వచనకవిత్వాన్ని పురాణకవిత్వం చేయకుండా ఫ్యూడల్ వర్గరచయితల ఇనుపకౌగిలినుంచి వచనకవితను రక్షించిన రచయితలలో వరవరరావు ఒకడు. అనుప్రాసలు, అంత్యప్రాసలు, సమాసాలు, శుష్కవచనత్వం. మార్మిక ధోరణులు, అస్పష్టతలతో స్వరూపాన్ని కోల్పో

తున్న వచనకవితను కాపాడినవాళ్ళలో వరవరరావు ఒకరు. వ్యవహారిక భాష, భావానికి తగ్గట్టు పాదాలు విరపటం, సమగ్ర అర్థాన్ని బలమైన సంగ్రహవాక్యాల్లో చెప్పడం వరవరరావు వచనకవిత్వంలో సాధించిన విజయాలు. వచన కవితను నూతన ప్రజాస్వామిక పోరాటానికి వాహికగా చేశాడు.

"నోటికీ కాళ్ళకూ ఇది జైలు
చెయ్యిరాయటం మానలేదు
మనస్సు రాపాడటం మానలేదు
ఒంటరి చీకటినుంచి పయనించి కలలు
వెలుగుతీరాలకు చేరుతూనే వున్నాయి" (రక్తస్వప్నం).

ఎక్కడికక్కడ భావానుగుణ్యంగా వాక్యాలు విరిగి ఏ ఆర్భాటం లేకుండా దూసుకువచ్చిన రచన యిది. పదాలమీద, భావావేశంమీద వచనకవికి అవసరమైన విగ్రహం వరవరరావుకు వుంది. కొందరిలా పదచాపల్యంలో "వచన ప్రబంధం" రాయకుండా వుండటం విశిష్టలక్షణం.

"లెనినంటే లేబర్
లెనిన్ లిబరేషన్
లెనిన్ వ్యక్తికాదు శక్తి
లెనిన్ విగ్రహంకాదు విప్లవం" (లెనిన్)

లెనినిజాన్ని బలమైన చిన్నవాక్యాల్లో వచనకవితా సహజరూపాన్ని కాపాడుతూ చెప్పగలిగాడు. శ్రోతలముందు చదువగలిగితే పాట చేసినంత ప్రభావం వచనకవిత్వం చేయగలదు. వచన కవిత్వంలో పాటలకంటే 'విస్తారవస్తువు'ను ప్రదర్శించవచ్చును. ఆ అవకాశాన్ని కవిత్వ పరిధిల్లో వరవరరావు సాధించాడు.

విప్లవ కవిత్వంలో రెండు ప్రధాన ధోరణులు కనిపిస్తాయి. ఒకటి విప్లవ కాల్పనిక కవిత్వం (Revolutionary Romanticism) రెండోది విప్లవ వాస్తవిక కవిత్వం (Revolutionary realism) హృదయాన్ని ఆశ్రయించి సంవేదనాత్మకమైన ఇమేజరీలలో చెప్పే కవిత్వం మొదటిది. బోధనాశక్తికంటే పరవశింపచేసే శక్తి దానికి ఎక్కువ. ఈ పద్ధతి చాలా ప్రాచీనమైంది. రెండోది ఆలోచనాత్మకమైక ఇమేజరీలతో చారిత్రిక విహితత్వం (Histrocism) వైపు ఆలోచనలను సుముఖంచేయటం. ఇది ఆధునిక కవిత్వపు ప్రధాన లక్షణం. మనోవైజ్ఞానిక శాస్త్రయుగానికి ఇలాటి కవిత్వం సహజం. కవిత్వాన్ని "Thinking in images" గా మార్క్సిస్టు మేధావులు నిర్వచించారు. వరవరరావు కవిత్వం ప్రధానంగా ఈ తరగతికి చెందింది.

"ఆలోచన అడుగుజాడల్లో
నడిచే ఆయుధం అంచుమీద వాడి
నా మాట
ట్రిగర్ మీద సూటి నా మాట
తుపాకిలో దట్టించిన మందు నా మాట"
(మాటలు)

"నెత్తురులో మెరుస్తున్న రోడ్డు
శ్రీకాకుళం ఒరలోంచిదూసి
దోపిడి రాజధానిగుండెల్లో గుచ్చిన
కత్తిలాగున్నది."

"ఈ కత్తి అంచుమీద
సిద్ధాంతం పదునెక్కుతున్నది
చీకటి నిద్రలోంచిదిమిన
దీపంలా మెరుస్తున్న కల"

(తూర్పున వుదయించిన ఎర్రజండా ఆకాశంనిండా వెలుగుతోంది)

"నిప్పుపూల గాలులతో ఆచరణ
రివిజనిజం దుమ్మును ఊడుస్తున్నది"
చీకట్లోకి తూర్పు సూర్యుణ్ణి
తీసుకుపోయే లైట్లు వాళ్లు
(ఊరేగింపు)

"మోదుగుల తలలలో
ఎర్ర ఆలోచనలు
ఇనుపరాతిగట్ల
మనసులో మంటలు"

(కాముణ్ణి చంపి వాని నెత్తురుతో వసంతాలు చల్లుకుందాం)

పాతకుల హేతుశక్తిని చంపకుండా అవగాహన శక్తులను మండించేశక్తి యీ రకం ఇమేజరీలతో నిండిన కవిత్వానికి ఎక్కువ సమాజంలో భావరంగాల్ని, ప్రజాభిప్రాయాన్ని, జనతా ప్రజాతంత్ర విప్లవంవైపు సుముఖంచేయటంలో వరవరరావు అనుసరించే కవిత్వ పద్ధతి శాస్త్రీయమైనది. ఇదికూడా వరవరరావు వ్యక్తిత్వంలోని సామూహిక పుద్యమశీలానికి అనుగుణ్యమైనదే.

సంఘంలో దారుణ దురన్యాయాన్ని, పాలకవర్గాల కుహనాఘాతుక స్వభావాన్ని, ఆదర్శవాదుల్లోని ముసుగు సంస్కారాన్ని నగ్నంచేయటానికి అవహేళన రచనలు పదునైన ఆయుధాలు. ఈ ప్రక్రియను అతిగా వుపయోగిస్తే వస్తుగాంభీర్యం తగ్గి శిల్పగుత్తాధికారం పెరిగే ప్రమాదం వుంది. పరిమితంగా అవహేళన రచనలను చేయటం విప్లవ కవులకు అవసరం వరవరరావు అవహేళన రచనలుకూడా సమర్థవంతంగా నిశితంగాను చేయగలడు. "భయ భయ భయ జయహే", 'సామ్యవాదం రంకె' ఈ రెండు అవహేళన రచనలు. పాలకవర్గాల ప్రజావ్యతిరేక స్వభావాన్ని, దోపిడీ విధానాన్ని, అహింస, శాంతి, సామ్యవాదంవంటి ఆదర్శాల ముసుగులను వరవరరావు నిశితంగా అవహేళన చేశాడు.

"నిజంతల్లీ సోషలిజం తెస్తే నువ్వే తేవాలి
ఇంత తేనెపూసినకత్తి ఇంకెక్కడుంది చెప్పు"

ఈ రచనలో 'జాతీయ గీతాన్ని' అవహేళనకు వుపయోగించాడు.

"భూస్వాముల గడ్డితిని
భూసంస్కరణలు నెమరువేస్తున్నది"

ప్రజల్లో బాగా ప్రచారంలోవున్న గంగిరెద్దుపాటను 'సామ్యవాదరంకె'లో అనుసరించాడు.

వరవరరావు నేటి విప్లవ కవిత్వ వుద్యమంలో అగ్రగామి సాంస్కృతిక కార్య కర్త. విప్లవ వాస్తవికతను శాస్త్రీయంగా కవితా ప్రమాణాలను నిలబెడుతూ చెప్పిన నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక విప్లవ సైనికుడు. వ్యక్తిస్వభావాన్ని అధిగమించి నిరంతర ఆత్మవిమర్శతో వుద్యమిస్తున్న యువశక్తి వరవరరావు.

తరతరాల దోపిడిలో
నలిగిన తోటిమానవుని కన్నీళ్ళు తుడిచేందుకు
కత్తుల వంతెనమీద
గుండెనెత్తురుల తర్పణచేస్తూ పయనిస్తున్న గెరిల్లాకు
అడవిలో పరిమళించిన అగ్నికి
విప్లవ సాగరంలోలేచిన మహోత్తుంగ తరంగానికి
కత్తి వాడి, కలంవేడి, జనం జీవనాడి, తెలిసిన సవ్యసాచికి
జనం వూపిరితో
భవిష్యత్‌లోకి ఉన్నతంగా
ఎర్రజెండా ఎత్తుతున్న సైనికుడికి
కన్నీటిలో కరెంటు పుట్టించి
చీకటిపొట్టలో బయొనెట్ గుచ్చి
బతుకుబాట ఎర్రగా వెలిగిస్తున్న
రోగగ్రస్త వ్యవస్థకు శస్త్రచికిత్స చేస్తున్న
శాస్త్రజ్ఞుని
కారుణ్యమూర్తికి
మనిషంటే విప్లవమని
క్షణ క్షణం ప్రాణాలతో
యుగ ధర్మాన్ని రాస్తున్న
బతుకంటే ఏమిటో నిరూపిస్తున్న
ప్రజను సాయుధంచేస్తున్న రెవల్యూషనరీ
కామ్రేడ్ కె.జి. సత్యమూర్తికి
వరవరరావు
ఈ 'ఊరేగింపు'ను అంకితం చేయడం
విప్లవానికి లాల్‌సలామ్ చేయడమే.

— టి. యం. యస్.

# కొండను తవ్వి పట్టారు ఎలుకను! చచ్చిన చిట్టెలుకను!!

మేము "జుడిషియల్ కష్టడీ"లో ఉన్నట్టు లెక్క. అది ఏమిటో మాకు తెలియనిస్తేగద! ప్రభుత్వం ధర్మమా అని, మేము జైళ్ళనే ఇల్లుగా, హాస్టలుగా, బాతాఖనీ క్లబ్బుగా, ఇంతెందుకు, మా లోకం సమస్తంగా చేసుకోవలసి వచ్చింది. అత్తావారిల్లు ఎంతమాత్రమూ కాదు. ఆ విషయమై ముఖ్యమంత్రులుంగారికి భయం అక్కర్లేదు. జైలరు ఖాకీ యూనిఫారాల లాఠీహస్తాల రంగురంగుల టోపీల పెద్దమనుషులూ- వీరి అడుపాజ్ఞల కిందనే నిజానికి మేముంటున్నాము. జైలును పిచ్చాసుపత్రిగా మార్చేందుకు యిది చాలు.

"సమాజం"అనే పేరుగల విశాలమైన బహిరంగమైన ఖైదులో మాకు స్వేచ్ఛను నిరాకరించడము లోగడ జరిగింది. సదరు సమాజంతాలూకు ఒక చిన్నముక్కలాంటి 'జైలు'లో ఆ స్వేచ్ఛను నిరాకరించడం యిప్పుడు జరిగింది. ఈ 'జైలు' అనబడేది మూసివేసిన సూక్ష్మప్రపంచం. దిక్కు మొక్కూలేని అధిక సంఖ్యాక, సామాజిక భాగంమీద సాయుధ, సురక్షిత, అల్ప సంఖ్యాకభాగం పెత్తందారీ జులుం సాగించే ప్రపంచానికి సూక్ష్మాకారమే యీ జైలు.

మా జైలర్లకు సమృద్ధిగా ఉన్నది మాకు సర్వసంపూజ్యమే మరి! అదేమిటంటే మొరటుదనం, కరకుదనం, అది సహజమే. మేము పాలితులం, దుష్పాలితులం అయితిమి. అయినా ఇలాంటివారు సమాజంలో నూటికి 80 వంతులున్నారు. ఈ దుష్పాలక శేఖరుల దృష్టిలో మా అపరాధం, ఈ 80 వంతుల మందికోసం రాయడం, పాడడం, మాట్లాడ్డం, పనిచెయ్యడం, శ్రమించడం మాత్రమే. ఇది 'రెచ్చగొట్టడం' అవుతున్నదట! ఆ ఘనకార్యం మాదికాదు, పాలకులదే. రేయింబవళ్ళూ ఆ పని వాళ్లు చేస్తూనే ఉన్నారు. ఈ పెరిగిపోయే ధరలు, ద్రవ్యోల్బణ పరిస్థితులు, నిరంతరక్షామం, ఆర్థాకలి, క్షోభ యివన్నీచాలక రాక్షస దమనకాండ ఆ పని మాబాగ చేస్తున్నాయి. అందుచేత పాలకులు మా స్థానాన్ని, మేము వారిస్థానాలను పొందాలి. తమ మెడలపై గల కాడిని విదిలించివేసుకొని, ప్రజలు తమ భాగ్యానికి, భవతవ్యానికీ తామే కర్తలు, బాధ్యులూ కావలెనని మా ఆకాంక్ష.

మా యథార్థ సంరక్షకుల తరహా రుచి చూడాలంటే యీ నెల 7 న జరిగిన ఒక ఘటన మీరు వినాలె—

ఆరోజు మధ్యాహ్నం భోజనాలు ముగించుకొని మేము కునుకుతీస్తూ ఉన్నట్లుండి మా బారక్స్ గచ్చునేలమీద గిట్టలచప్పుడువిని ఉలికిపడుతూ కళ్ళుతెరచిచూశాం. మాకు కనిపించింది చతుష్పాద జంతువులకు మారుగా ఉక్కుమడిమల ద్విపాద జంతువులు.

వాటిచేతుల్లో ఇనపపొన్నుకర్రలు ఉన్నాయి. వాటిపేరు జైలు జవానులు. మేమెందరమో వాళ్ళందరున్నారు. మా వస్తువులు "వెతక"బోతున్నారు. ఇద్దరు అసిస్టెంటు జైలర్ల పర్యవేక్షణకింద ఈ తతంగం సాగుతున్నది. "జైలరు"అనే పేరుగల జైలు పాలిటి గైరుహాజరు భూస్వామి ఇచ్చినహుకుం ఇది. ఇటీవలే న్యూఢిల్లీలోపొందిన ఖైదీల (నీః) ఆదరణ—నిరాదరణలో ఉన్నతస్థాయి శిక్షణ తాలూకు పాఠాలను ఆయన వెనువెంటనే, తన బుర్రనుంచి ఎగిరిపోకముందే, అమలుపెట్టదలిచాడులాగుంది.

మా వస్తువులన్నింటిని- పుస్తకాలు, నిత్యం ఉపయోగించే సామాన్లు, దుస్తులు- ఏదీ వదలకుండా గెలికారు. విదిలించారు. తిరగదిప్పిచూశారు. ఈ అన్వేషకులు, ఈ పరిశోధకులు దేన్ని అన్వేషిస్తున్నట్టు? రహస్యజీవితం సాగించే నక్సలైటునా, అది చాల ప్రియమైనవస్తువు. పరబ్రహ్మ అన్నా అది పరమపూజ్యం. చిమ్మచీకటినిండిన కొట్లో నల్లగండుబిల్లినా? అది కావాలంటే బెర్నార్డుషా నాటకంకోసం పుస్తకాల షాపు కెళ్లాల్సిందే. మరి పట్టపగటిపూట కళ్ళకు కాగడాలు కట్టుకొని వాళ్ళు దేన్ని అన్వేషిస్తున్నారు?

చిట్టచివరకు, ఎట్టకేలకు, భీముడుపడినంత శ్రమపడి, కొండను మొదలంటా తవ్వి ఎలుకను, అదునా చచ్చిన చిట్టెలుకను బైటకేశారు! మాకు వంటవార్పుల్లో సహాయపడే 'సి' క్లాసు ఖైదీ తాలూకు డ్రాయరును కనిపెట్టారు. పాపం అభంశుభం తెలియని ఈ వస్తువుచేసిన అపరాధంఏమిటో! అపరాధమా? దానిరంగే దాని అపరాధం అది ఎర్రగాఉంది. ఎర్రటి గుడ్డపేలిక ఎద్దును బెదరగొడుతుంది అంటారు. ఈ ఎర్రటి ఎద్దులాంటి మొద్దులాంటి మనుషులనుకూడ బెదరగొట్టినట్లుంది.— దీనిలో సుత్తీ-కొడవలిగుర్తు తెల్లగా కుట్టకపోయినప్పటికీ ఏమైనా అమందా నందకందళిత హృదయారవిందులై గొప్పవిషయాన్ని కనిపెట్టామన్న సంతృప్తితో, సంతోషంతో దాన్ని "ట్రాఫీ" లాగా పట్టుకెళ్ళారు. కాని, ఇప్పటిదాకా అది వాళ్ళ కళ్ళముందే వుండిందిమరి. దాని యజమాని లబోదిబోమంటున్నా లెక్కించకుండా విజయయాత్ర చేసుకుంటూ దాన్ని మోసుకెళ్ళారు.

అప్పుడు గుర్తుకు వచ్చింది మాకు. గత మాసం 28 న భారత ప్రజల ప్రియతమనాయకుడు కామ్రేడ్ చారుమజుందార్ రెండవ వర్ధంతి సందర్భంగా భారతరైతాంగ సాయుధ విప్లవంలో ప్రాణాలర్పించిన యితర అమరవీరులనుకూడ స్మరిస్తూ ఎగరవేశాం. అరుణారుణ విప్లవ పతాక, మార్క్సియన్ సోషలిజం ధ్వజం, అంతర్జాతీయ కార్మికవర్గ చిహ్నం, ఎర్రజెండా. మాసి, చిరిగి, రంగువెలసినందుచేత సగర్వంగా ఎగరవేయలేక కాబోలు, సరిగ్గా ఆరోజునే జైలు మేడమీదనుండి తీసివేసిన త్రివర్ణ

పతాకస్థానంలో మేం ఎగరేసిన ఎఱ్ఱజెండా రెపరెపలాడింది. ఆ జండాను తీసివేసుకు నేందుకు యీ చిన్న పనుల పెద్దమనుషులు మా బారక్స్‌మీద యీరోజు దాడిచేసి 'సెర్చి' చేశారు.

"జుడిషియల్ కస్టడీ" అనబడేదానికింద వ్యవహారం సాగే తీరూతెన్ను ఇదండీ, మేజిస్ట్రేటు మహాశయా!

ఇంకొక తార్కాణం కావలసివస్తే రాత్రివేళల్లో మా మీద గార్డు డ్యూటీ నిర్వహించే జైలు కానిస్టేబుళ్లు, ఇటీవలి కాలాన భారత కాలమానం 19-00 గంటలకల్లా మమ్మల్ని లోపలికి నెట్టి మంద కడుతున్నారు అలా చెయ్యమని పైనుండి ఉత్తర్వన్నమాట। మాకు రాత్రి భోజనం లేకున్నా ఫర్వాలేదు అలాగే మేము భారత కాలమానం 18-00 గంటలకల్లా ఆటా పాటా ఆపుచెయ్యాలి బుద్ధిమంతులైన పిల్లల్లా భారతకాలమానం 21-00 గంటలకల్లా బజ్జొని నిద్రకు ఉపక్రమించాలి. ఆల్ ఇండియా రేడియో వివిధభారతి ప్రసారాలను భారత కాలమానం 20-00 ముందు వినగూడదు. ఈ మనుషుల ముక్కులు ఒక్కొక్కమారు పక్షుల, జంతువుల ముక్కుల్నీ, కళ్లు గుడ్లగూబ కళ్ళను. గబ్బిలం కళ్ళను గుర్తు చేస్తుంటాయి. ఎలాగంటే కటకటాల్లోంచి అవి ఈవలి మా ప్రపంచంలోకి. బారుగా చొచ్చుకవచ్చి మా రాతకోతల్ని చదువు సంధ్యల్నీ అసాధ్యం చేస్తుంటాయి.. కనురెప్పలు మూతపడని కాపలా అంటే యిదే కాబోలు! మా పెరటిలో ఉండిన మంచి పూలమొక్కల్ని గొడ్డలి, పారతో ఖండించి నిర్మూలించివేయడం, జైలరుగారి క్రమశిక్షణ చర్యలపేరిట వెంగళాయ పనుల్లో తాజా పని. వీటన్నిటికీ "జైలుమాన్యువల్"ఆమోదం వుందట! అయితే ఒక అనుమానం. జైలుమాన్యువల్‌లో ఉంచుకున్నది ఈ సూత్రాలుమాత్రమేనా? మా రేషన్లువగైరాలకు సంబంధించి మరికొన్ని సూత్రాలులేవా? ఆ భగవంతుడికి తెలియకపోవచ్చునేమోగాని జైలరుకు తప్పక తెలిసి ఉండాలి. కాని ఆ పుస్తకాన్ని తెరిచి చూపిస్తే, జ్ఞానఫలం ఆరగించి పాపులమై పోతామేమో అని ఈ దీనమానవులపై ఆయన దయతలుస్తున్నారులాగుంది.

అంతకంటే మరింత చీకాకుకలిగించే వ్యవహారం ఒకటివుంది ఈ నరుబు రాత్రి తొమ్మిదిగంటలయింది మొదలు ప్రతి పావుగంటకు గుండెలవిసేలా "సబ్ ఠీక్‌హై"అంటూ, జైలు ప్రపంచంలో అంతా సవ్యంగాఉందని జైలు సర్వేశ్వరుడైన సూపర్నెంటుగారికి గుండెధైర్యం కలిగించేందుకు ఆయన చెవినవేస్తూ అరుపులు, కేకలుపెడుతుంటారు. కోమలగాత్రి అయినరాత్రి తన ప్రశాంతినుండి సుషుప్తినుండి దద్దరిల్లిపోయేలా ఈతంతు సాగుతుంది.

"సబ్ ఠీక్ హై" అంటున్నారు. మా నిజమైన కస్టోడియన్లు. "సబ్ ఠీక్ హై" అంటున్నారు ఆకాశ సింహాసనంమీద కూర్చున్న మా జైలర్లు విక్టోరియారాణి "చల్లటి" హయాములో జీవించిన కవి బ్రౌనింగ్ అన్నమాటలు మాకు గుర్తు వస్తున్నాయి "ప్రపంచం హాయిగా ఉంది. భగవంతుడు స్వర్గధామంలో కుదురుగా ఉన్నాడు" నిజానికి, ప్రపంచం హాయిగా ఉండటంలేదు; ఉండలేదుకూడ. రణరంగం ప్రశాంతంగా లేదు; ఉండదుకూడ సమాజం తీవ్రవ్యాధిగ్రస్తమై ఉంది. మనుషులు కల్లోల మనస్కులై ఉన్నారు. వారి ఓర్మికికూడ ఒకహద్దుఉంది. పీడితులూ దళితులూ- కార్మికులూ, రైతులూ, తదితరులూ- ఈ నిస్సహాయమైన దేశంలోని మహామానవకోటి, క్రికటోనీ అగ్నిపర్వత శిఖరంలా బద్దలై నల్లటి లావాప్రవంగా, ఉష్ణప్రవంగా అసమ సామాజిక వ్యవస్థను కోపఘూర్ణిత తరంగులకింద ముంచెత్తివేస్తున్నారు. భారత ఆకాశ తలంలో త్రివర్ణ పతాకస్థానాన్ని అరుణపతాకం ఆక్రమించివెయ్యగలదు. మా జైలర్లు జైళ్ళపాలౌతారు. మమ్మల్ని సాధించి బేధించేవాళ్ళు తామే ఆ అవస్థపొందుతారు. మా ప్రాసిక్యూటర్లు ప్రాసిక్యూటు అయి. జడ్జీలు బోనులోనిల్చొని. కారల్‌మార్క్స్ అన్నట్లు, "దోపిడీదార్లు దోపిడీపాలౌతారు".

[13–8–74న సికిందరాబాదు 10వ మెట్రోపాలిటన్ కోర్టులో కె. వి. రమణా రెడ్డిగారు చదివిన యింగ్లీషు ప్రకటనకు తెలుగు అనువాదం.]

లేఖ :

'ఉదయ కిరణాలు' శీర్షిక కింద వరవరరావు *A B C D* అనే అక్షరాలతో ఏం నేర్పాలో పిల్లలకు చెప్పాడు. కాని యీనాడు ఆ అక్షరాలతో ఏం నేర్పుతున్నారో ఆగస్టు 3 ఫ్రాంటియర్‌లో ఒక రచయిత యిలా రాసాడు. "In the new alphabet that the children in India are learning **A** is for arrest, **B** is for bullets and bayonets, **C** would have been for corruption, but Mrs. I. G. (Inspector General Indira Gandhi) has ruled that out of order for being a world phenomenon. So, **C** is for conspiracy" [భారత దేశంలో పిల్లలు *A* నుండి అరెస్టు *B* నుండి బులెట్స్ మరియు బయనెట్స్ నేరుస్తున్నారు. *C* నుండి కరప్షన్ (లంచగొండితనం) ఉండాల్సింది- కాని శ్రీమతి ఐ.జి. (ఇన్స్‌పెక్టర్ జనరల్ ఇందిరాగాంధి)గారు అది ప్రపంచ పరివ్యాప్తంగా ఉన్నదే అని తోసిపుచ్చారు. కొబట్టి *C* నుండి కాన్స్‌పిరసీ అంటే కుట్ర !]

ఈ బూర్జువా విద్యావిధానం ఒంటబట్టిస్తున్న పై విషయాలనుంచి 'సృజన'వంటి పత్రికలు 'ఉదయ కిరణాలు' (పిల్లల)నయినా కాపాడే పాత్రను సమర్థంగా నిర్వహించాలని ఆశిస్తాను–

— ఒక పాఠకుడు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాల్లో రచయితల, మేధావుల పాత్ర–

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా పాలస్తీనా విముక్తి పోరాటం ఇజ్రాయిల్ సమాజాన్నికూడా ఆలోచింపచేస్తున్నది– ఇజ్రాయిల్‌లోవున్న పాలస్తీనా గెరిల్లాలు గెరిల్లాచర్యలను ఉధృతంచేసి యూదు జాతి ప్రజలుకూడ పాలస్తీనా ప్రజల హక్కులు రక్షింపబడాలని గుర్తించేలా చేస్తున్నారు. యూదు జాతి కవులు, రచయితలు, మేధావులు పాలస్తీనియన్లతో చర్చలు జరపాలని, ఇజ్రాయిల్ సమాజాన్ని ప్రజాతంత్రంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు, జియోనిజం సామ్రాజ్యవాదం ముద్దుబిడ్డే :

దక్షిణ కొరియా ప్రజలు చేపట్టిన ప్రగతి, స్వేచ్ఛ, శాంతి ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా రివిజనిజానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు సాగిస్తున్న పోరాటాల్లో భాగమే. దక్షిణ కొరియాలో కమ్యూనిస్టు విద్యార్థి సంఘటనతో కలిసి కుట్ర చర్యలు చేస్తున్నాడనే ఆరోపణపై దక్షిణ కొరియా అభివృద్ధి నిరోధక ప్రభుత్వం కిమ్ చిహా అనే కవిని కాల్చివేసింది. ఆయనకు మా విప్లవ జోహార్లు–

---

## జైళ్లు ఎర్రజెండా ఎగరేసినవి–

### విశాఖ సెంట్రల్ జైల్లో

28–7–'74న విశాఖ సెంట్రల్‌జైల్లో నగ్జల్బరీ ఉద్యమనిర్మాత, పార్టీ నిర్మాత, గౌరవనీయుడు, ప్రియతమ నాయకుడు, అమరుడు కామ్రేడ్ చారుమజుందార్‌వర్ధంతిని మార్క్సిస్టు–లెనినిస్టుపార్టీ విప్లవకారులు జరుపుకున్నారు.

"వర్గశత్రు సంహారక యుద్ధం వర్ధిల్లాలి", "భారత రైతాంగ గెరిల్లా పోరాటం వర్ధిల్లాలి", "మావో ఆలోచనావిధానం వర్ధిల్లాలి", "కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం వర్ధిల్లాలి" మొదలగు నినాదాలమధ్య కామ్రేడ్ కె.జి. సత్యమూర్తి అరుణ పతాకాన్ని ఎగరవేశారు. తదుపరి జరుపుకున్న సమావేశంలో కామ్రేడ్ ఎస్. ఎ. రవూఫ్ మాట్లాడుతూ భారత రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వాన ప్రారంభించబడిన సాయుధ పోరాటాన్ని తుదకంటా కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

### ముషీరాబాద్ జైల్లో :

సికింద్రాబాద్ కుట్రకేసులో అరెస్టయిన మా–లె కార్యకర్తలు తదితరకేసుల్లో వున్న విప్లవకారులు మరియు విప్లవ రచయితలు ముషీరాబాద్‌జైల్లోకూడా జులై 28న

కామ్రేడ్ చారుమజుందార్ ద్వితీయ వర్ధంతి జరుపు కొన్నారు- "చారుమజుందార్ అమర్ హై; మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానం వర్ధిల్లాలి! వర్గశత్రు నిర్మూలన కొనసాగుతుంది" మొదలగు నినాదాలు మారుమ్రోగినవి. భారత రైతాంగ సాయుధపోరాటంలో ప్రాణాలర్పించిన ఇతర అమరవీరులనుకూడా స్మరిస్తూ ఎర్రజెండా ఎగురవేశారు-

## సంతాపదినంగా ఆగస్ట్ 15 - జెయిల్లో

ముషీరాబాదు జెయిల్లోవున్న మార్క్సిస్టు-లెనినిస్టు కార్యకర్తలు ఇంగువ మల్లికార్జునశర్మ, ఎల్. విజయకుమార్ మున్నగువారు ఆగస్టు 15నాడు సంతాపదినంగా ఉదయం నల్లజెండా ఎగురవేసారు. "అమెరికా సామ్రాజ్యవాదం, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం నశించాలి! ఝూటా ఆజాదీ ముర్దాబాద్! కసాయి ఇందిర డౌన్ డౌన్! బూటకపు సోషలిజం నశించాలి! కామ్రేడ్ చారుమజుందార్‌కు విప్లవ జోహార్లు! మా-లె. పార్టీ వర్ధిల్లాలి" మొదలగు నినాదాలు యిచ్చుకుంటూ ఊరేగింపుచేసారు. రాత్రి మరల సమావేశమై ఇండియాకువచ్చిన బూటకపు స్వాతంత్ర్యాన్ని గురించి చర్చించారు.

ఇదేజైల్లో 'సికిందరాబాదు కుట్రకేసు'లో నిందితులుగావున్న విప్లవ రచయితలు, సానుభూతిపరులుకూడా ఆగస్ట్ 15 ఉదయం సమావేశమై దానిని విషాదదినంగా జరుపుకున్నారు. జాతీయోద్యమం గురించి గోఖలే, గాంధీ, నెహ్రూ, పటేల్‌ల నిజరూపాలగూర్చి కె.వి.ఆర్. గారు చాలా విపులమైన చారిత్రకవివరాలు చెప్పారు. ఈనాడు దేశంకోసం నిజంగా పోరాడి ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, పృథ్వీసింగ్ వంటి వాళ్ళను స్మరించుకోవాలని చెప్పారు. మధ్యాహ్నం యీ రోజు స్పెషల్‌గా ప్రభుత్వం పంచిన స్వీట్, పకోడీలను 'మేం ఈరోజును స్వాతంత్ర్య దినంగా గుర్తించడంలేదని' చెప్తూ నిరాకరించారు

## కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి ఎర్రజెండా ధరించాడు

ఈ నెల 7వ తేదీన కాకినాడ ఆస్పత్రిలో కావలికిచెందిన రాజమండ్రి ఖైదీ కోటారెడ్డి ఆపరేషన్‌తర్వాత చనిపోయాడు- 4 ఏళ్ళక్రితం తాళ్ళపాలెం భూస్వామి పుచ్చలపల్లి వెంకటార్రామిరెడ్డి హత్యలో పాల్గొన్నాడని దొంగసాక్ష్యాలునమ్మి అతనికి యావజ్జీవ ఖైదుశిక్ష విధించింది. కళ్ళూ చెవులూ లేనిచట్టం. అతనిది సన్నకారు రైతు కుటుంబం- వయస్సు 45 ఎప్పుడూ ఉత్సాహం. లొంగుబాటులేని గుండెనిబ్బరం- జీవితాన్ని పోరాట పాఠశాలగాతప్ప జీవించనివాడు- మంచిమనిషికాబట్టి కమ్యూనిస్టు, కాగలిగాడు- కమ్యూనిస్టు కాబట్టికూడా మంచిమనిషి అయ్యాడు- అందుకే తననెరిగిన వాళ్ళకు. ముఖ్యంగా పేదవాళ్ళకు ఎర్రజెండా నిర్భయసాహసంగా, నిర్మలాదర్శకాంతిగా మానవత్వంగా, మంచితనంగా కనిపిస్తుంటాడు కామ్రేడ్ కోటారెడ్డి

## పోలీసులే ప్రభుత్వం !

అగస్ట్ 1న వరంగల్ సి. కె. యం. (చందా కాంతయ్య మెమోరియల్) కాలేజి విద్యార్థులు ఆ కాలేజి లెక్చరర్, ప్రముఖ విప్లవకవి వరవరరావుగారి అరెస్టుకు నిరసనగా తరగతులను బహిష్కరించి విప్లవ నినాదాలతో జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్ళి ఆయన విడుదలను డిమాండ్ చేస్తూ మెమొరాండం యిచ్చారు. మళ్ళీ ఆగస్టు 8న ముఖ్యమంత్రి వరంగల్ వచ్చిన సందర్భంలో సి. కె. యం. కాలేజి మరికొన్ని స్థానిక కాలేజీలు మరియు స్కూళ్ళ విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. సి. కె. యం కాలేజీకి చెందిన ఒక విద్యార్థి వరవరరావుగారి విడుదలను డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రికి మెమొరాండం యివ్వబోగా పోలీసులు అడ్డగించి దురుసుగా ప్రవర్తించి అతడిని వెనక్కి పంపించేశారు. తిరిగి ఆగస్టు 13న 60 మంది సి. కె. యం కాలేజీ విద్యార్థులు సికిందరాబాద్ 10వ మెజిస్ట్రేట్ కోర్టుకు, తదుపరి ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళి వరవరరావు మొదలగు విప్లవకవుల విడుదలను డిమాండ్ చేస్తూ మెమొరాండం యివ్వడానికి ఒక బస్సులో బయలుదేరారు. పోలీసులు జీపులలో వారిని వెంటాడి సికిందరాబాద్‌లో దిగితే దారుణ ఫలితాలుంటాయని బెదిరించి, ప్రతి విద్యార్థి అడ్రెస్ తీసుకొని బస్సు దిగనీయకుండా వారిని తిరిగి వరంగల్ పంపించారు. వారిపై నిఘా ఉంచారు. కోర్టులో తమవారిని చూసి మెమొరాండం యిచ్చుకునే కనీస పౌరహక్కు కూడా లేని దారుణ నిరంకుశ పోలీసు పాలనలో మనం ఉన్నాం.

* * *

ప్రపంచంలో అన్నింటికన్నా పెద్ద ప్రజాస్వామ్యం ఉన్న భారత దేశంలో శ్రీమతి ఇందిరాగాంధీ నిరంకుశపాలన సాగిస్తోందనీ, భారత దేశంలోనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంలో నమ్మకం లేదనీ, 'London School of Political Thought' వార్షిక సమీక్ష పేర్కొన్నది.

## విప్లవ చరిత్ర పాదాల కింద చెత్త

జూలై 29 న 'సృజన' ఎడిటర్ ఇంటిపై పోలీసులు 6 గం॥ సేపు దాడి జరిపి కొన్ని రచనలను, ఉత్తరాలను స్వాధీనపరచుకొన్నారు. 3 నెలల క్రితం వరవరరావును బనాయింపు కుట్ర కేసులో యిరికించి అరెస్టు చేయడం, ఇప్పుడు ఆయన యింటిపై దాడితో యింటి వారిని భయభ్రాంతుల్ని చేసి ఏవో అబద్ధపు ఆధారాలు సృష్టించే ప్రయత్నం చేయడం, ఆయనను దీర్ఘకాలిక నిర్బంధానికి గురిచేయాలనే ప్రభుత్వపు నీచమైన కుట్రలో భాగమే.

మన దేశంలోనేకాదు ప్రపంచ వివిధదేశాల మేధావులు, రచయితలు కూడా భారత దేశంలో మేధావుల, రచయితలపై కొనసాగుతున్న కనీ వినీ ఎరగని యీనాటి అనాగరిక ఫాసిస్టు దమకాండను తీవ్రంగ ఖండించారు-కొన్నిచోట్ల ప్రదర్శనలు కూడ చేశారు. అయినా దున్నపోతు చర్మమూ, దోపిడీ కొవ్వూ బలిసిన ప్రభుత్వానికి చీమ కుట్టినటు కూడాలేదు-

అంతులేని దొంగనిల్వలు పట్టుబడి జైళ్ళలోవేయబడ్డ నల్ల ముఖం బ్లాక్ మార్కెట్ గాళ్ళను మన ముఖ్యమంత్రులంగారు 'ఉగాది కానుక'గా మళ్ళీ దేశంమీదిక వదిలినారు. దీన్నిబట్టి ఆయన ఎంత ఆదర్శవంతుడైన కాంగిరేచు మనిషో ఎవరిపక్షాన నిలబడ్డాడో, ఎవరి ఏజెంటో చెప్పవలసిన పనిలేదు. (మిగులు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌లో గత సంవత్సరం వరి బాగా పండినా బియ్యం ధర తగ్గేబదులు యీయనగారి హయాంలో ఎలా హెచ్చిందో గమనించండి!)

విప్లవ రచయితలకు, పత్రికలకు, విరసానికి, సంబంధించిన ప్రతిచిన్న విషయాన్నీ తానే చూసుకుంటూ, పోలీసులను రేచుకుక్కల్లా ఉసిగొల్పుతున్న యీ చౌకబారు 'పెద్ద కానిస్టేబుల్' బుర్రలో కుట్రలూ, కుహకాలూ తప్ప ఇంకేమైనా ఉన్నదా? ఈనాడు ఆంధ్ర దేశంలో ప్రతి నాలుగోవాడు సి. ఐ. డీయే. ఆంధ్ర రాష్ట్రమే ఒక పెద్ద పోలీసు క్యాంప్ అయిపోయింది. ప్రజల పక్షం వహించిన విప్లవకారులకూ, విప్లవ రచయితలకూ, విప్లవ సాహిత్యానికీ, అడుగడుగునా నిర్బంధం- దోపిడీదార్లకూ దోపిడీ సెక్సు సాహిత్యాలకూ, సినిమాలకూ, ఎల్లెడెలా స్వేచ్ఛ! బరితెగింపు! ఇదీ మన రాష్ట్రంలో కొనసాగుతున్న ముఖ్య పోలీసు పాలన.

విప్లవ రచయితలయెడ, విప్లవకారులయెడ, కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరించే ప్రజా వ్యతిరేకులు ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రములోనూ ఎంతటి సింహాసనాలను కౌగిలించుకొని ఉన్నా ప్రజల కోపాగ్నికి ఆహుతికాక తప్పదు. విప్లవ రథ చక్రాల కింద నలిగిపోక తప్పదు.

## విప్లవ శ్రద్ధాంజలి

వరంగల్‌కు చెందిన విప్లవ విద్యార్థి 'గణేశ్' ఆగస్టు 25 నాడు ఇక్కడి యం.జి.యం. హాస్పిటల్‌లో ధనుర్వాతంతో చనిపోయాడు. 22 ఏళ్ళ యీ యువ కామ్రేడ్ భవిష్యత్తులో రెపరెపలాడే ఎర్రజెండాపై చూపునిలిపి ప్రయాణిస్తున్న సమరశీలి- విప్లవోద్యమంవైపు బాణంలా దూసుకుపోతున్న యీ యువశక్తి యిలా అర్థాంతరంలో ఆగిపోవడం విప్లవానికి ఎంతోనష్టం- ఈయన స్మృతికి మా విప్లవ శ్రద్ధాంజలి.

— విప్లవ విద్యార్థులు, వరంగల్

## అరెస్టులు. ఖండనలు.

కామ్రేడ్ వరవరరావు ఇంటిపై పోలీసులదాడిని ముఖ్యమంత్రి పరమనీచమైన ఎత్తుగడగా పేర్కొంటూ విరసం చిత్తూరుజిల్లాశాఖ ప్రభుత్వపు అక్రమ నిర్బంధాల్ని, అమానుష సోదాల్ని ఖండించింది—

ఫాసిస్టు దురంతాన్ని ధ్వంసంచేస్తూ పురోగమించిన విప్లవ ప్రజానీకమే విప్లవాన్ని, విప్లవకారులను రక్షించుకొంటుందని ప్రకాశంజిల్లా విరసం యూనిట్ పేర్కొన్నది

ఉత్తరాల్ని చింపిచూడటం దగ్గరినుండి చంపి ఎన్‌కౌంటర్‌లో చచ్చినట్లు ప్రకటించేవరకు ఎన్నో దారుణాలు, చిత్రహింసలుచేస్తూ, దొంగకుట్రలు బనాయిస్తున్న ప్రభుత్వ చర్యలను వనపర్తి చైతన్య సాహితి అధ్యక్షులు శ్రీ కిట్టు ఖండించారు.

ఆగస్టు 10 నాడు జీవన్, చారుమజుందార్ బుక్‌స్టాల్ వీరన్న, యాకూబ్ మొదలగు వారిని నిర్బంధించి వారికేమాత్రం సంబంధంలేని కేసుల్లో యిరికించిన పోలీసు దౌర్జన్యాన్ని ఖమ్మం, వరంగల్ జిల్లా విరసం శాఖలు ఖండిస్తున్నవి. రాజమండ్రి పట్టణ విరసం కన్వీనర్ డా. కాటా నారాయణరావు తదితరుల అక్రమ నిర్బంధాన్నికూడా వరంగల్ విరసం శాఖ ఖండిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ఎన్. జీ వో. ల సంఘ అధ్యక్షులు శ్రీ ఐ.బి. రామకృష్ణారావు తెలంగాణా ప్రజాసమితి శ్రీ సత్యనారాయణరెడ్డి విప్లవ రచయితల అరెస్టులను తీవ్రంగా ఖండించారు— అసెంబ్లీలో శ్రీ సి. వి. కె. రావు విప్లవ రచయితలపట్ల ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.

"రాజమండ్రి విరసం శాఖ కన్వీనర్ డా॥ కాటా నారాయణరావు అక్రమ అరెస్టును మేం తీవ్రంగా ఖండిస్తున్నాం—" — [కోర్టులో విప్లవ రచయితలు]

---

## సవరణ

'పెన్ పిస్టల్' అనే శీర్షిక కింద ఆగస్ట్ సృజనలో 'యాత్రిక్' రాసిన కవితలో ఆ రచయితే రాసిన 'ముసలి మూర్ఖులు కొండను తవ్వుతున్నారు' అనే కవితకూడా కలిసిపోయి ఒకేకవితగా ప్రకటింపబడింది— ...'చీకట్లో, సాక్షులకోసం గాలిస్తున్నారు' అనే చరణంతో 'పెన్ పిస్టల్' కవిత ముగిసింది— 'ముసలి మూర్ఖులు కొండను తవ్వుతున్నారు' అనే చరణంతో రెండో కవిత అదే శీర్షికగలది మొదలవుతుంది. పాఠకులు సవరించి చదువుకోగలరు.

సం॥

---

'ఉదయ కిరణాలు'

## సారూ! మనమూ!

— చెరబండరాజు

సారూ! మనమూ
పొలాల కెళ్దాం
శ్రమజీవులతో
స్నేహం చేద్దాం ॥సారూ॥

కూలి పిల్లలతో
చేతులు కలిపీ
చెమటతొ నేలను
తడితడి చేద్దాం ॥సారూ॥

పరుగుతొ నీటికీ
స్వేచ్ఛత వలెనే
పనితో మా చై
తన్యం పెరుగును ॥సారూ॥

భట్టీయంతో
బండలమవుతాం
పనితో తెలివీ
తెలివితొ పనులూ ॥సారూ॥

ఈ రోజుతొ ఈ
పాతాలొద్దు
మార్కుల చదువులు
మాకసలొద్దు ॥సారూ॥

(అముద్రిత 'మామయ్య పాటలు'నుండి)

---



---

రాజమండ్రి విరసం కన్వీనర్ డా. కాటా నారాయణరావుగారిని అగస్ట్ 26 నాడు పోలీసులు అరెస్టు చేశారు- ప్రజల స్వాతంత్ర్యాన్ని హరించే యీ ప్రభుత్వ దమననీతిని ఖండిస్తూ వారిని వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

పత్తిపాటి వెంకటేశ్వర్లు
ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం

SRJANA Telugu Monthly Sep. '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

# నెత్తురు కారుస్తున్న జైళ్లు....

సుమారు 35000 మంది ఖైదీలు అందులో అధిక సంఖ్యాకులైన నక్సలైట్లు ఏ విచారణలేకుండా యీనాడు పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, బీహార్ జైళ్ళలో పోలీసు అధికారుల అమానుష చిత్రహింసలకు గురిఅవుతున్నారు–

ప.బెంగాల్‌లో 13, 14 సం. యువకులదగ్గరనుండీ నక్సలైట్లు అనే అనుమానం వచ్చిన ఎందరో యువకులను పోలీసులు రేచుకుక్కల్లా వీధుల్లో తరిమి కాల్చి చంపి వేశారు– అనేకులను పోలీసు కస్టడీలో ఉండగానే హత్యచేశారు–

నక్సలైట్లుగా అనుమానింపబడ్డ యువతులను అరెస్టుచేసి తాము కోరిన సమాచారం వారినుండి పొందలేక చీకటి అండర్‌గ్రౌండ్ గదుల్లో బట్టలు ఊడదీసి, ఐసుబిళ్ళ మీద పడుకోబెట్టి పోలీసు ఆఫీసర్లు ఆ యువతుల మెడలమీద, చనులమీద, పొట్టలమీద మర్మావయవాలమీద సిగరెట్లతో కాల్చి, ఊహించలేని అవమానాలుచేసి అప్పటికీ 'సమాచారం'రాబట్టలేక రెచ్చిపోయి వారి మర్మావయవాల్లో ఇనుప కడ్డీలను చొప్పించి స్పృహతప్పిపోయినస్థితిలో పోలీసు వ్యాన్లలో జైళ్ళకు పంపించిన సంఘటనలుఎన్నో. 20, 22 రోజులకు వారు కోలుకున్నతరువాత మళ్ళీ అవే దారుణహింసలు పునరావృత మౌతాయి.

ఈ యువతులలో చాలా మంది విచారణలో ఉన్నప్పటికీ వారిని ఎన్నడూ మేజిస్ట్రేట్‌ముందు హాజరుపరుచరు– తమకు అవసరమున్న కాగితాలమీద మేజిస్ట్రేట్ సంతకాలు తీసుకొని వెళ్లతారు–

ఆశ్చర్యమేమిటంటే 'శాంతి భద్రతల'పేరిట యింత అమానుషం జరుగుతున్నా ఎవరికీ పట్టినట్లులేదు– ఎంత భయంకరమైన మౌనం!

(సెప్టెంబర్ 1, 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' ఆధారంగా)

[ ప్రజల కోపాగ్ని ప్రజ్వరిల్లుతున్నది– ఈ అమానుషమైన దోపిడీ పాలన అంతం చేరువలోనే ఉన్నది. ]

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)